ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 27.0

పూజారి ఖాతా నుంచి నగదు కాజేసిన సైబర్ నేరగాళ్లు
■ లోపలి పేజీలో..


ఇటీవల రైతులకు దాణా అందిస్తున్న ఎమ్మెల్యే చంటి

పాడి రైతులకు తీపికబురు

▸▸ 50 శాతం సబ్సిడీపై దాణా పంపిణీ

ఏలూరు టూటౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పాడి పశు రైతులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. రైతులకు 50 శాతం సబ్సిడీతో దాణాను సరఫరా చేస్తోంది. తెల్లరేషన్ కార్డు కలిగిన రైతులు, పశువుల పెంపకందారులకు సబ్సిడీతో దాణాను టీడీపీ ప్రభుత్వం అందిస్తుంది. 2014-2019 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం 50 శాతం రాయితీపై రైతులకు పశుదాణాను అందించింది. దీంతో పాలదిగుబడులు పెరిగి రైతులు లాభపడ్డారు. 2019-2024 సంవత్సరాల్లో అధికారంలోకి ఉన్న వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పేరుతో అటకెక్కించింది. దీంతో రైతులు బయట మార్కెట్‌లో దాణా కొనలేక అప్పుల పాలయ్యారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం రైతుల అభిమతాన్ని దృష్టిలో ఉంచుకుని మరలా పునఃప్రారంభించింది. దీనిలో భాగంగా మొదటి విడతగా జిల్లాలో 300 మెట్రిక్ టన్నుల సమీకృత పశువుల దాణాను జిల్లాలో రైతులకు పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు రెండు పాడి గేదెలు, ఒక పేయిదూడకు నెలకు 150 కేజీల చొప్పున పశుదాణాను పంపిణీ చేస్తున్నారు. ఒకేసారి మూడు నెలలకు 450 కేజీలు పంపిణీ చేశారు. 50 కేజీల బస్తా ఖరీదు రూ.1,110 కాగా 50 శాతం సబ్సిడీతో కేవలం రూ.555లకే అందజేశారు. లబ్ధిదారులు గ్రామంలో కానీ మండలంలోని కానీ పశుసంవర్ధక శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలి. ఆన్‌లైన్ ద్వారా, పశుసంవర్ధక శాఖ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. దాణాను సబ్సిడీపై ఇవ్వడం పట్ల పాడిరైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి దాణా పంపిణీ చేస్తారు.

రైతులు సద్వినియోగించుకోండి..



50 శాతం సబ్సిడీతో ఇస్తున్న పశుదాణా పథకం రైతులు సద్వినియోగించుకోవాలి. పశుదాణా వివరాల కోసం పశుసంవర్ధకశాఖ ఆసుపత్రిలో సంప్రదించ వచ్చు.

– డాక్టర్ గోవిందరాజు, పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్



వట్లూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ వద్ద క్యూలో అభ్యర్థులు.. హ్యాండ్‌బ్యాగ్‌ను తనిఖీ చేస్తున్న మహిళా పోలీస్

మెగా డీఎస్సీ ప్రశాంతం

ఏలూరు అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ ఉపాధ్యాయుల ఆశలసౌధం...మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్ ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాకేంద్రంలో ఈ పరీక్షలకు మూడు విద్యాసంస్థల్లో టెస్టు సెంటర్లను ఏర్పాటు చేయగా, తొలిరోజు రెండు సెంటర్లలో మాత్రమే పరీక్షలు జరిగాయి. స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు జరిగిన మొదటి షిఫ్టు పరీక్షకు 181 మంది అభ్యర్థులను కేటాయించగా 165 మంది, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగిన రెండో షిఫ్టు పరీక్షకు 180 మందికి 159 మంది హాజరయ్యారు. సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి ఉదయం షిఫ్టునకు 200 మందిని కేటాయించగా 181 మంది, మధ్యాహ్నం షిఫ్టు పరీక్షకు 200 మందికి 180 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 76 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష నిర్వహణలో సాంకేతిక అవాంతరాలు ఎక్కడా ఎదురుకాలేదని నిర్వాహకులు వివరించారు. పరీక్ష నిర్వహణ తీరును కలెక్టర్ వెట్రిసెల్వి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, తదితరులు పరిశీలించారు.

క్యూఆర్ కోడ్‌తో జనాభా నిర్వహణపై ప్రజాభిప్రాయం


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరుసిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జనాభా నిర్వహణ విధానంపై ప్రజలను భాగస్వాములను చేసేందుకు ఈనెల 20వ తేదీ వరకు క్యూఆర్ కోడ్ విధానం ద్వారా ప్రణాళికా శాఖ ద్వారా ప్రజాభిప్రాయం సేకరిస్తున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రణాళికా శాఖ ప్రచు రించిన జనాభా నిర్వహణ విధానం ప్రతి కుటుంబం ముఖ్యం- మీ అభిప్రాయం మార్గదర్శనం వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. రాష్ట్రంలో జనాభా సమతుల్యత లక్ష్యంగా జనాభా నిర్వహణ విధానం (పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ)పై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. ఇందుకోసం క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి 9 ప్రశ్నలకు సంబంధించి ప్రజలు తమ అభిప్రాయాలను ఈనెల 20వ తేదీ లోగా పంచుకోవాలన్నారు. సీపీవో సీహెచ్ వాసుదేవరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

▸▸ కలెక్టర్ వెట్రిసెల్వి

- ప్రభుత్వ అధికారుల విశ్వసనీయతను దెబ్బతీసే విధంగా ధ్రువీకరించని, నిరాధారమైన ఆరోపణలను వ్యాప్తి చేసే వారిపై చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెట్రిసెల్వి హెచ్చరించారు. నిరాధారమైన ఆరోపణలు వ్యాప్తి చేసే వ్యక్తులు, మీడియా ప్రతినిధు లు ఇతర సమూహాలు ఎవరైనా గాని చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

9వతేదీ నుంచి యోగాంధ్రపై ర్యాలీలు

- జిల్లా వ్యాప్తంగా ఈనెల 9వ తేదీన యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహనా ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రజలందరూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోజున తేదీన జిల్లాలోని ప్రతి గ్రామం, మండల కేంద్రాలు, పట్టణాలు, నగరాల్లో భారీ ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఎండతీవ్రత దృష్ట్యా ఉదయం 7గంటలకే ఈ ర్యాలీలను నిర్వహించాలని , ర్యాలీలో పాల్గొనే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీరు వంటివి అందుబాటులో ఉంచాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ పూర్తి

ఏలూరు సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన టీవోటీ శిక్షణ శుక్రవారం ముగిసింది. గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని ఎలా విస్తరించాలి, రైతులకు ఎలా మద్దతు ఇవ్వాలి అనే అంశాలపై ఈ శిక్షణ జరిగింది. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్‌బాషా , ఎంఏవోలు, ఏడీలు , ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ పీడీ బి.వెంకటేశ్, రైతు సాధికారిత సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ స్పెషల్ సెక్రటరీ రాజశేఖర్ ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన అంశాలను వివరించారు. ఈ శిక్షణ ద్వారా మండల స్థాయి అధికారులు రైతులతో నేరుగా కమ్యూనికేషన్ చేయడం, వారి సమస్యలను అర్థం చేసుకుని సరైన మార్గదర్శనం ఇవ్వడం వంటి కీలక నైపుణ్యాలపై పట్టు సాధించారు.


పుస్తకాల నాణ్యతను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కిట్ల నాణ్యత పరిశీలన

ఏలూరు అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు తెరిచేలోగా విద్యార్థి మిత్ర కిట్లను సరఫరా చేయాలని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ బి.శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఏలూరు, పెదవేగి, పెదపాడు మండలాలకు సంబం ధించి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్ర కిట్ల పంపిణీని స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలు, వట్లూరు జడ్పీ హైస్కూలులో ఏర్పాటు చేసిన ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఆయన పరిశీలించారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాం వస్త్రం, బెల్టుల నాణ్యతను తనిఖీ చేశారు. కిట్లలో మిగతా వస్తువులను పాఠశాలలకు చేరేలా ఎంఈవోలకు సూచనలు ఇచ్చారు. స్టూడెంట్స్ కిట్స్ జిల్లా ఇన్‌చార్జి కె.ప్రతిష్ట, సమగ్రశిక్ష ఏపీసీ కె.పంకజ్ కుమార్, సీఎంవో రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రోగులను భయపెట్టొద్దు

▸▸ డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని

ఏలూరు అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రోగ నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్లదే కీలక బాధ్యత అయినందున అంకితభావంతో విధులు నిర్వర్తించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని సూచించారు. శుక్రవారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ల్యాబ్ టెక్నీషియన్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రోగ నిర్ధారణ పరీక్షల్లో అశ్రద్ధ చూపకుండా ఖచ్చితమైన పరీక్షలు నిర్వహించి ఫలితాన్ని ఇచ్చినపుడే రోగి భయపడకుండా ధైర్యంగా ఉండగలుగుతాడన్నారు. మలేరియా, డెంగీ నిర్మూలనలో ఎల్టీల పాత్ర కీలకమైనందున రోగులను భయపెట్టకుండా ధైర్యపర్చాలని సూచించారు. రక్తపరీక్షలకు వినియోగించే ఐదు రకాల పరికరాలను ల్యాబ్ టెక్నీషియన్లకు అందజేశారు. డీఎంవో డాక్టర్ ప్రసాద్, కార్యాలయ ఏవో డాక్టర్ గంగాభవాని, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ బ్యాంకు రుణాల స్కాం దర్యాప్తు వేగవంతం
■ లోపలి పేజీలో..



గ్రామ పంచాయతీల.. డిజిటలైజేషన్

▸▸ స్వర్ణ పంచాయతీల్లో డేటా సేకరణ
▸▸ ముందంజలో జిల్లా..
▸▸ మొత్తం పంచాయతీలు 547

ఏలూరుసిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల డిజిటైలేజషన్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. జిల్లాలో మొత్తం 547 గ్రామ పంచాయతీలుండగా స్వర్ణ పంచాయతీల విధానంలో డిజిట లైజేషన్ ప్రక్రియ అన్ని గ్రామ పంచాయతీల్లోను కొనసాగుతోంది. దీనినిమిత్తం స్వర్ణ పంచాయతీల్లో డేటా సేకరణ జరుగుతోంది. ఈ డేటా సేకరణలో ఏలూరు జిల్లా ముందంజలోనే ఉంది. పంచాయతీలను డిజిటలైజేషన్ చేయడం వల్ల ఇక నుంచి ఇంటి పన్నులు డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లింపులు చేసుకునే అవకాశం కలుగుతుంది. దీంతో పారదర్శకంగా ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, ఇతర పన్నులు చెల్లించడానికి అవకాశం ఏర్పడుతుంది.

స్వర్ణ పంచాయతీల విధానంలో ఇంటిపన్నుల డిమాండ్, కలెక్షన్‌ను డిజిటలైజేషన్ చేస్తారు. ఇంటి, కుళాయి పన్నులు, ఇతర పన్నుల డిమాండ్‌కు సంబంధించి ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేస్తారు. ఈ ప్రక్రియలో ప్రధానంగా సొంతిళ్లు, జాయింట్ ఇళ్లు, ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన ఆస్తులకు ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేస్తారు. జిల్లాలో మొత్తం సొంతిళ్లు 3,90,797 ఉండగా వీటికి సంబంధించి 3,78,585 మంది యజమానులున్నారు. ఈ ఇంటి యజమానులకు సంబంధించి ఇప్పటివరకు 3,21,904 (85.03 శాతం) ఇళ్లకు సంబంధించి ఆధార్ సంధానం చేశారు. ఇంకా 56,681 మంది సొంతిళ్ల యజమానుల వివరాలను ఆధార్ అనుసంధానం చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియలోనే జాయింట్ ఆస్థులు కలిగి ఉన్న వారు 7432 మంది ఉండగా ఇప్పటివరకు 3961 యజమానుల (53.3 శాతం) వివరాలను ఆధార్ అనుసంధానం చేశారు. ఇంకా 3.471 మంది వివరాలను ఆధార్ అనుసంధానం చేయాల్సి ఉంది. ప్రభుత్వ ఆస్థులకు సంబంధించి 4.789 మంది యజమానులుండగా వీరిలో ఇప్పటివరకు 3.753 యజమానుల (78.37 శాతం) వివరాలను ఆధార్ అనుసంధానం చేయగా ఇంకా 1036 మంది ప్రభుత్వ ఆస్థుల యజమానుల వివరాలను ఆధార్ అనుసంధానం చేయాల్సి ఉంది.

ప్రత్యేక యాప్‌లో పన్నుల వివరాలు

స్వర్ణ పంచాయతీల కాన్సెప్ట్‌లో ఇంటి పన్నులు, ఇతర పన్నుల డిమాండ్, కలెక్షన్లను ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తున్నారు. జిల్లాలో 3,91,088 ఇళ్లకు సంబంధించి రూ. 43.86 కోట్లు పన్నుల డిమాండ్ ఉండగా ఇందులో బకాయిలు రూ.6.32 కోట్లు, ప్రస్తుత పన్నుల డిమాండ్ రూ.37.54 కోట్లుగా ఉంది. పన్నుల వసూళ్లలో భాగంగా 1,83,456 ఇళ్లకు సంబంధించి ఇప్పటివరకు రూ.22.21 కోట్లు వసూలయ్యాయి వీటిలో బకాయిలు రూ.2.66 కోట్లు, ప్రస్తుత పన్నులు రూ.19.54 కోట్లు వసూలయ్యా యి. ఇక జిల్లాలో 2,06,928 ఇళ్లకు పంబంధించి రూ.21.65 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇందులో బకాయిలు రూ3.66 కోట్లు, ప్రస్తుత పన్నుల డిమాండ్ రూ.17.99 కోట్లుగా ఉంది. అంటే 49.36 శాతం ఇంకా పన్నులు వసూలు కావాల్సి ఉంది. ఈ వివరాలను యాప్‌లో పొందుపరచాల్సి ఉంది.

త్వరిత గతిన డేటా సేకరణ

జిల్లాలోని అన్ని స్వర్ణ గ్రామ పంచాయతీల్లో ఈ డేటా సేకరణ ముమ్మరంగా సాగుతోంది. డేటా సేకరణ త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నాం.ఎప్పటిక ప్పుడు సమీక్షలు నిర్వహించి పర్యవేక్షి స్తాం.

– కొడాలి అనూరాధ, జిల్లా పంచాయతీ అధికారిణి

ఉపాధి కూలీల ఆకలి కేకలు

▸▸ ఎనిమిది వారాలుగా అందని వేతనాలు
▸▸ జిల్లాలో సుమారు రూ.100 కోట్లు బకాయిలు

ఏలూరు రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు వేతనం రాక ఇబ్బం ది పడుతున్నారు. ఎని మిది వారాలుగా కూలీల ఖాతాల్లోకి డబ్బులు జమ కావడం లేదు. దీంతో కూలీలు ఎప్పుడు పడతాయోనని ఎదురు చూపులు చూస్తున్నారు. ఉపాధి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా రు. ఆరు రోజులలోపు కూలీల ఖాతాలోకి నగదు జమ కావాల్సి ఉండగా నేటికీ వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కూలీలు పేర్కొంటున్నారు. జిల్లాలో 3,22,262 జాబు కార్డులు ఉండగా 5 లక్షల 48వేల 450 మంది శ్రామికు లు పనులు చేస్తున్నారు. ఉపాధి పనుల్లో భాగంగా నీటి కుంటలు, ఇంకుడుగుంతలు, భూమి చదును, సరిహద్దు కందకాలు, పశువుల నీటి తొట్టెలు, పంట కాలువలు తదితర పనులు చేస్తున్నారు. ఉపాధి హామీ చట్ట ప్రకారం పనులు చేసిన 16 రోజుల్లో శ్రామికులకు వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. కాని పనులు చేసి రెండు నెలలు గడుస్తున్నా వేతనాలు అందలేదు.



రూ.100 కోట్లు బకాయిలు

మార్చి వరకు శ్రామికులకు వేతనాలు ఏప్రిల్, మే నెలల్లో చేసిన పనులకు వేతన బకాయిలు జమ కావాల్సి ఉంది. ఒక్కో కుటుంబానికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు బకాయి వేతనాలు రావాల్సి ఉంది. నెలలుగా వేతనాలు విడుదల కాకపోవడంతో కూలీలు ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోతున్నారు. ఉపాధి హామీ శ్రామికులు రెండు నెలలుగా పనులు చేసినా ఇంత వరకు వేతనాలు, అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బం దులతో సతమతమవుతున్నారు. గతంలో వేసవి అలవెన్స్ ఫిబ్రవరిలో 30 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం, జూన్‌లో 20 శాతం వరకు పనుల పరిమాణం తగ్గించి 100 శాతం పనికి వేతనం అందించేవారు. దీనిని కూడా నిలిపివేయడంతో కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదు.


కరపత్రాలను విడుదల చేస్తున్న రైతుసంఘం నాయకులు

పామాయిల్‌పై దిగుమతి సుంకం 50 శాతానికి పెంచాలి

▸▸ 9న కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా

పెదవేగి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకం 10 శాతం తగ్గించడం దేశీయంగా ఆయిల్‌పామ్ రైతుల ఆర్థిక వనరులను దెబ్బతీయడమే అవుతుందని, ఆయిల్ పామ్ రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 9వ తేదీన ఏలూరు కలెక్టరేట్ దగ్గర ధర్నా నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. విజయరాయిలో శుక్రవారం నిర్వహించిన ఆయిల్‌పామ్ రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముడి పామాయిల్ దిగుమతి సుంకం 10 శాతానికి తగ్గించడంతో ఆయిల్‌పామ్ గెలల ధర తగ్గి, రైతులు నష్టపోతున్నారన్నారు. దిగుమతి సుంకాన్ని 50 శాతానికి పెంచి రైతులను ఆదుకోవాలని, టన్నుకు రూ.22వేలు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పెదవేగిలో కొత్తఫ్యాక్టరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆయన కోరారు. ఆయిల్‌పామ్ రైతులంతా భారీగా తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతులు మున్నంగి సుబ్బారెడ్డి, పూసం రామరెడ్డి, రాపర్ల తేజకృష్ణ, సీలం శ్రీనివాసరావు, భీమవరపు సాంబిరెడ్డి, ఆళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, దారిబోయిన రమేష్, ఎం.జగన్మోహ నరావు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు పంచాయతీలో... రూ.8 కోట్ల అవినీతి

▸▸ షోకాజు నోటీసులు జారీ
▸▸ త్వరితగతిన తిరిగి కట్టించాలని వార్డు సభ్యుల డిమాండ్

కైకలూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కైకలూరు గ్రామ పంచాయతీలో రూ.8,08,05,886 అవినీతి జరిగినట్లు విచారణలో వెల్లడైన నేపథ్యంలో సర్పంచ్‌కి కలెక్టర్ షోకాజు నోటీసు ఇచ్చినట్టుగా వార్డు సభ్యులు కేవీఎస్‌ఎం నాయుడు, మేడూరి నాంచారయ్య తెలిపారు. కైకలూరు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2021 ఏప్రిల్ 3వ తేదీ నుంచి 2025 ఫిబ్రవరి 5వ తేదీ వరకు కైకలూరు పంచాయతీలో జరిగిన అవకతవకలపై చేసిన ఫిర్యాదుల మేరకు కలెక్టర్ ఆదేశాలతో పంచాయతీ అధికారులు విచారణ చేపట్టినట్టు తెలిపారు. ఈ వ్యవధిలో ఏడు గురు పంచాయతీ కార్యదర్శులుగా, ఇన్‌చార్జి కార్యదర్శులుగా సర్పంచ్‌తో కలిసి పరిపాలన సాగించారన్నారు. పంచాయతీలో పని చేసే పారిశుధ్య కార్మికులు, వాటర్ వర్క్స్, ఇతర సిబ్బంది జీతాలను వారి అకౌంట్లో నేరుగా వేయకుండా డ్రా చేసినట్లుగా నిర్ధారణ అయిందన్నారు. వీటితో పాటు పలు పనులు నిమిత్తం ఎలాంటి బిల్లులు లేకుండా నిధులను సర్పంచ్, కార్యదర్శి కలిపి నిధులను డ్రా చేశారన్నారు. ఈ విచారణలో మొత్తం ఎనిమిది కోట్ల ఎనిమిది లక్షల ఐదు వేల ఎనిమిది వందల ఎనభై ఆరు రూపాయలు (రూ.8,08,05886) అవినీతి జరిగినట్లుగా వెల్లడైందన్నా రు. అయితే ఈ మొత్తాన్ని అధికారులు త్వరితగ తిన పంచాయతీకి జమ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, పంచాయతీ కార్యదర్శుల నుంచి అవినీతికి పాల్పడిన సొమ్ము రాబట్టాలని డిమాండ్ చేశారు. పంచాయతీలో జరిగిన అవినీతిని ప్రశ్నించడం వల్లనే వార్డు సభ్యుల పై ఎస్సీఎస్టీ కేసులు పెట్టి భయ భ్రాంతులకు గురి చేశారని, అయినా ఫిర్యాదు చేసిన వార్డు సభ్యులు భయపడకుండా ముందుకు వెళ్లడంతో పూర్తిస్థాయిలో విచారణ జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మంచి గంటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వార్డు సభ్యులు

షోకాజ్ నోటీసులు వాస్తవమే..

కైకలూరు పంచాయతీలో సర్పంచ్ డీఎం నవరత్నకుమారి పదవీకాలంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి రూ.8,08,05,886 మొత్తానికి ఆయా కాలంలో పని చేసిన సర్పంచ్‌కి, కార్యదర్శులకు జిల్లా కలెక్టర్ షోకాజు నోటీసులను జారీ చేసిన మాట వాస్తవమే. వీటిపై 15రోజుల లోపు వివరణ ఇవ్వాలని కలెక్టర్ కోరారు.

– ఆనందభూషణం, పంచాయతీ కార్యదర్శి, కైకలూరు

ఎస్సీ నిరుద్యోగ యువతకు శిక్షణ

ఏలూరుసిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో షెడ్యూలు కులాలకు చెందిన చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో లిడ్‌క్యాప్- సీడాప్ ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు ఎస్సీ కార్పోరేషన్ ఈడీ ఎం.ముక్కంటి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన ఎస్సీ కులాల అభ్యర్థులు తమ దరఖాస్తులను జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు నేరుగా లేదా ఈ-మెయిల్ ద్వారా గాని సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 94932 91177, 79814 38585, 94944 77597 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సాంఘిక సంక్షేమశాఖ డీడీగా విశ్వమోహన్‌రెడ్డి

ఏలూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా వై.విశ్వమోహన్‌రెడ్డి శుక్రవారం బదిలీపై ఇక్కడ నియమితులయ్యారు. ఈయన శ్రీకాకుళంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఈ మేరకు ఆ శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం.నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

10న కేఆర్ పురంలో జాబ్‌మేళా

ఏలూరుకార్పొరేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ కెరీర్ సర్వీస్, ఐటీడీఏ ఆధ్వర్యంలో కేఆర్‌పురంలోని వైటీసీ మీటింగ్ హాలులో ఈనెల 10వ తేదీ ఉదయం 9 గంటలకు యువతకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పనా అధికారి సి.మధుభూషణరావు తెలిపారు. 18-22 ఏళ్ల వయస్సు కలిగిన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఉద్యోగంలో ఎంపికైన వారికి ఉన్నత చదువులకు స్కిల్ ట్రైనింగ్‌కు అవకాశం ఇస్తామన్నారు. వివరాల కోసం సెల్ నంబర్ 88868 82032లో సంప్రదించాలన్నారు.





డీఎస్సీ సందడి

మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్ ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఏలూరు జిల్లా కేంద్రంలో ఈ పరీక్షలకు మూడు విద్యాసంస్థల్లో టెస్టు సెంటర్లను ఏర్పాటు చేయగా, తొలిరోజు రెండు సెంటర్లలో మాత్రమే పరీక్షలు జరిగాయి. పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి భీమవరం పట్టణంలోని డీఎన్నార్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా పరీక్ష నిర్వహించారు.



ఏలూరులో చెక్ చేసి పంపుతున్న దృశ్యం



భీమవరంలో...











ప్రాబ్లమ్ జోన్



ఫౌంటేన్‌కు ఏమైంది ?

తణుకు నరేంద్ర సెంటర్‌లో ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా ఫౌంటేన్ నిర్మించారు. రాత్రయితే రంగులు విరమజిమ్ముతూ నీరు వెదజల్లుతూ అందంగా బాటసారులకు కనువిందు చేసేది. సెంటర్ శోభాయమానంగా కనిపించేది. అయితే కొన్ని నెలలుగా నిర్వహణలేక మరమ్మతులకు గురైంది ప్రస్తుతం ఫౌంటేన్‌లో నాచు కట్టిన నీరుతో దర్శన మిస్తుంది. మున్సిపల్ అధికారులు నిర్వహణ చేపట్టడం లేదు. సాయంత్రం వేళ ఆహ్లాదాన్ని అందించే విధంగా ఫౌంటేన్‌కు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలని కోరుతున్నారు.

-తణుకు (ఆంధ్రజ్యోతి)



పాలకోడేరులో అడుగంటిన మంచినీటి చెరువు

దాహం తీరేదెలా..!

గ్రామాల్లో మంచినీటి చెరువులు అడుగంటాయి. చాలా గ్రామాల్లో పరిశుభ్రమైన తాగు నీరు అందక ప్రజలు విలవిల్లాడుతున్నారు. పాలకోడేరు మండలంలోని గొల్లలకోడేరు, పాలకోడేరు, గొరగనమూడి, మైప, శృంగవృక్షం, పెన్నాడ, విస్సాకోడేరు తదితర గ్రామాల్లో చెరువులు అడుగంటాయి. పాలకోడేరు, మైప, వేంద్ర గ్రామాల్లో చెరువులు అడుగంటినప్పటికీ ఆయా గ్రామాల్లో బోరు నీరు అందించి దాహం తీర్చుతున్నారు. గొల్లలకోడేరు, గొరగనమూడి తదితర గ్రామాల్లో బోరు నీరు అంతంత మాత్రంగానే ఉండటంతో ఒకపూటతోనే నీరు అందించి సరిపెడుతున్నారు. మరికొన్ని రోజుల్లో పంట కాలువలు రాకపోతే ఆయా గ్రామాల్లో తాగునీటి కోసం ఇబ్బందులు తప్పవని గ్రామస్తులు అంటున్నారు. ఒకవైపు కాలువల తవ్వకాల పనులు చేపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కాలువలు విడుదల చేయడం ఆలస్యమైతే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని అంటున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో కాలువల్లోకి త్వరితగతిన నీరు అందించాలని కోరుతున్నారు.

-పాలకోడేరు, (ఆంధ్రజ్యోతి)



కోలనపల్లిలో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం

నెరవేరని స్వచ్ఛగ్రామాల లక్ష్యం !



స్వచ్ఛ గ్రామాలు దిశగా చెత్తనుంచి సంపద సృష్టించాలని ప్రభుత్వం అడుగులు వేసింది. గ్రామాల్లో లక్షల వ్యయంతో నిర్మించిన సంపద కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. చెత్తను ఆదాయ వనరులుగా మార్చాలన్న లక్ష్యం ఆచరణకు నోచుకోవడం లేదు. పశ్చిమ గోదావరి జిల్లాలో 394 గ్రామ పంచాయతీలకు సంబంధించి 368 సంపద తయారీ కేంద్రాలు నిర్మాణం చేశారు. ప్రతి గ్రామంలో చెత్తశుద్ధి సంపద కేంద్రాన్ని నిర్మించారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను తరలించి శుద్ధిచేసే ప్రక్రియ ప్రారంభించారు. గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు ఉన్నచోట నిర్మాణాలు చేశారు. అయితే అవి లక్ష్యానికి దూరంగా ఉత్సవ విగ్రహాలుగా ఆయా గ్రామాల్లో దర్శనం ఇస్తున్నాయి. గ్రామాల్లో చెత్తను సేకరించి ఈ కేంద్రాలకు తరలించాలి. ఈ ప్రక్రియ ఏగ్రామ పంచాయతీలో కూడా జరగడం లేదు. గ్రామాల్లో రహదారి మార్జిన్, కాలువ గట్లు వెంబడి చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో సేకరించిన చెత్త సంపద కేంద్రాలు వద్దకు చేర్చే రహదారి మార్గాలు కూడా లేకుండా నిర్మాణాలు పూర్తి చేశారు. వీటిని వినియోగంలోకి తెస్తే పంచాయతీలకు ఆదాయంతో పాటు రైతులకు సేంద్రియ ఎరువు లభిస్తుంది.

- ఆకివీడు (ఆంధ్రజ్యోతి)

సార్వాకు ఏవి అనుకూలం ?

వరి విత్తనాలపై శాస్త్రవేత్తల సూచనలు



పెనుమంట్ర, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో సాగు చేసే పంటలలో వరి ప్రధానమైనది. సార్వాలో ఈ రెండు జిల్లాల్లో కలిసి సుమారు రెండు లక్షల హెక్టార్లలో వరి సాగు చేస్తారు ప్రస్తుతం రైతులు నారు మడులు పోసుకోవడానికి సన్నద్ధమవుతున్నారు. ఈ సమయంలో జిల్లాకు అనువైన రకాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మార్టేరు వరి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు సూచించిన వరి వంగడాలు ఇవీ..

ఎంటీయు 1318 : తక్కువ నత్రజనితో అధిక దిగుబడి ఇచ్చే పడిపోని రకం ఇది. పంట కాలం 150 రోజులు. రెండు వారాలు నిద్రావస్థ కలిగి ఉండి మొలకెత్తదు. సన్నగింజ రకం, కాండం, ధృడంగా ఉండి చేనుపై పడిపోదు. గింజ మధ్యస్త సన్నంగా ఉండి పచ్చి బియ్యానికి అనుకూలం. బియ్యం పారదర్శకంగా ఉండి ఎక్కువ గింజలు కలిగి అధిక దిగుబడి వస్తుంది.

స్వర్ణ (ఎంటీయు 7029) : తక్కువ నత్రజనితో అధికదిగుబడి ఇచ్చే రకం. చౌడు భూముల్లో సాగుకు, ఎండాకు తెగులు ఆశించే ప్రాంతాలకు అత్యంత అనుకూలం. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే అధిక దిగుబడి ఇస్తుంది. పంట కాలం 150 నుంచి మూడు వారాలు ఉంటుంది. నిద్రావస్థ కలిగి ఉండి గింజ మొలకెత్తదు

ఇంద్ర (ఎంటీయు 1061) : చేను పడి పోదు. పిలక దశలో 10 రోజులు వరకు ముంపు తట్టుకుని అధిక దిగుబడి ఇస్తుంది. సన్నబియ్యం. మార్కెట్ రేటు ఎక్కువగా ఉంటుంది. పంట కాలం 150 రోజులు.

మారుటేరు సాంబ (ఎంటీయు 1224) : సన్నబియ్యం . దీని పంట కాలం 140 రోజులు. దోమపోటును తట్టుకుంటుంది. బియ్యం పారదర్శకంగా ఉండి అన్నానికి బావుంటుంది.

మారుటేరు మసూరి (ఎంటీయు 1262) : సన్నబియ్యం.. పంట కాలం 155 రోజులు. రెండు వారాల నిద్రావస్థ కలిగి ఉండి ఎండాకు, దోమ పోటును తట్టుకుంటుంది. కాండం ధృడంగా ఉండి చేను పడిపోదు. గింజ రాలిక తక్కువగా ఉంటుంది.

సుజాత (ఎంటీయు 1210) : పంట కాలం సార్వాలో 135 రోజులు, దాళ్వాలో 125 రోజులు . 2 వారాలు నిద్రావస్త కలిగి దోమ పోటు, అగ్గి తెగులును తట్టుకుంటుంది. కాండం గట్టిగా ఉండి చేను పడిపోదు. గింజ రాలిక తక్కువగా ఉంటుంది. నేరుగా విత్తే విధానానికి కూడా అనుకూలం

అమర (ఎంటీయు 1061): పిలక దశలో రెండు వారాలు వరకు ముంపు తట్టుకుంటుంది. చేను పడిపోదు. దోమ పోటు, ఎండాకు తెగుళ్ళను తట్టుకుంటుంది. పంట కాలం 150 రోజులు.

వేసవి దుక్కులు ప్రారంభం

చింతలపూడి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గత మే నెలలో పడిన అకాల వర్షాలకు మెట్ట రైతులు దుక్కులు సిద్ధం చేసుకున్నారు. ప్రతీ ఏడాది ఖరీఫ్‌లో జూన్ రెండో వారంలో తొలకరి వర్షాలు ప్రారంభమవుతాయి. జూన్ 11న రైతులు ఏరువాకతో పొలాలు దున్నుకుంటారు. ఏ మాత్రం వర్షం పడినా నారుపోసుకోవడం ప్రారంభిస్తారు. అయితే ఈ ఏడాది మే నెలలో వర్షాలు పడడంతో చింతలపూడి మండలంలోని రైతులు వరి సాగు కోసం వేసవి దుక్కులు సిద్ధం చేసుకున్నారు. ఈ విధంగా మండలంలో 50 శాతంకుపైగా పొలాలు దుక్కులు దున్నుకున్నారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ సబ్సిడీపై జనుము, జీలుగు విత్తనాలు సరఫరా చేయగా ప్రకృతి సేద్యంలో కూడా పచ్చిరొట్ట కోసం నవ ధాన్యాలు వినియోగిస్తున్నారు. వీటిని రైతులు విరివిగా చల్లుకుంటున్నారు. ఇటీవల వర్షాలకు మొలకెత్తాయి. ఒక మోస్తరు తడులు ఉన్నా కొద్ది కాలంలోనే పచ్చిరొట్ట పెరుగుతుంది. పెరిగిన పచ్చిరొట్టను పొలాల్లో కలియ దున్నుతారు. అవి కుళ్ళి భూమికి ఎరువుగా అదును చేరుతుంది. నల్లరేగడి నేలల్లో పెరిగిన ఈ మొక్కలు ఈ విధంగా చేయకపోతే వర్షాలు పడితే సాధ్యంకాదు. అందుకే ముందుగా ఈ వేసవి దుక్కులు దున్నుతుంటారు. ఇవి కాకుండా కూలీల కొరత, సాగు ఖర్చులు పెరగడంతో రైతులు కూడా కరియత (వెదజల్లే విధానం)నే ఎంచుకుంటున్నారు. అందుకోసం ముందుగానే రెండు, మూడు సార్లు దుక్కులు దున్నాల్సి ఉంటుంది. దీనివల్ల ఊడ్పు ఖర్చులు భారం తగ్గుతుంది. ఈ విధంగా మండలంలోని కాంతం పాలెం, రాఘవాపురం, మల్లాయిగూడెం, వెంకటాపురం, సమ్మెటవారి గూడెం గ్రామాల్లో ఈ విధానం సాగు పెరిగింది. అందుకే రైతులు ఈ వేసవి దుక్కులను సిద్ధం చేసుకుంటారు. నాలుగు రోజులుగా ఎండలు తీవ్రంగా కాస్తున్నాయి. ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే వచ్చాయన్న వార్తలతో దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు ఇప్పుడు వర్షాలు వెనక్కిపోవడంతో ఆందోళనపడుతున్నారు. వర్షాలు కురిపించు దేవుడా అని మొక్కుకుంటున్నారు.



దుక్కులు దున్ని సిద్ధం చేసిన పొలం



ఈడూరులో స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా వరాల వెంకన్న రథోత్సవం





అత్తిలి, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి) : అత్తిలి మండలం ఈడూ రులో వరాల వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు సందర్భంగా శుక్రవారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన స్వామి వారి రథంలో స్వామి వారితో పాటు ఉభయ దేవేరులను ఉంచి ఊరేగించారు. బ్యాండు వాయి ద్యాలు, తీన్మార్ డప్పులు, ఏనుగు అంబారీతో పాటు విచిత్ర వేషధారణలతో ఊరేగింపు నిర్వహించారు. ఉదయం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరిం చారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.



తిరువీధుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు.

నేత్రపర్వం.. శ్రీవారి ఏకాదశి ఉత్సవం

ద్వారకాతిరుమల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తొళక్క వాహనంపై ఉభయనాంచారులతో కొలువుతీరిన చిన్న తిరుమలేశుడు శుక్రవారం రాత్రి క్షేత్రపురవీధుల్లో ఊరేగారు. అట్టహాసంగా జరిగిన ఈ ఏకాదశి ఉత్సవం భక్తజనులకు నేత్రపర్వమైంది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లను తొళక్కం వాహనంపై ఉంచి ప్రత్యేకపుష్పాలంకరణ చేశారు. అనంతరం మేళతాళాలు, డోలుసన్నాయివాయిద్యాల నడుమ స్వామివారు కొలువుదీరిన వాహనాన్ని ఊరేగించారు.

తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదేవత

9న బండి ముత్యాలమ్మ జాతర ప్రతి మూడేళ్లకు ఉత్సవాలు

మొగల్తూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ భక్తుల కోర్కెలు తీర్చే ఆరాధ్యదేవతగా ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారు ప్రసిద్ధి చెందారు. తాడిచెట్టు చుట్టూ నిర్మించిన ప్రాకారమే అమ్మవారి ఆలయంగా బాసిల్లుతున్నది. ఈనెల 9వ తేదీ రాత్రి అమ్మవారి జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం వద్ద భారీ విద్యుత్ దీపాలంకరణలతో పాటు ఆలయ పరిధి నాలుగు గ్రామాల్లోనూ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. మూడు సంవత్స రాలకు ఒకసారి నిర్వహించే ఈ జాతరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు.

ఇదీ చరిత్ర..

బ్రిటిష్ పాలనలో ముత్యాలపల్లి గ్రామానికి చెందిన కరణం, మునసబులుగా చెన్నాప్రగడ, దాసరి వంశీయులు ఉండేవారు. ముత్యాలపల్లి ప్రాంతంలో వసూలు చేసిన పన్నుల మొత్తాన్ని బ్రిటిష్ ప్రభుత్వానికి జమ చేసేందుకు జలమార్గం ద్వారా మద్రాసు వెళ్లారు. వీరు అక్కడ ఒక సత్రంలో బసచేసి శిస్తు చెల్లించాల్సిన నాణేలు లెక్కించగా నాలుగు నాణేలు తగ్గాయి. వాటిని ఎలా సమకూర్చాలంటూ ఆలోచిస్తూ నిద్రలోకి జారుకోగా బండి ముత్యాలమ్మ వీరికి కలలోకి వచ్చి నాపేరు బండి ముత్యాలమ్మ అని మీరు పడుకున్న సత్రం ఎదురుగా ఉన్నానని మీతో పాటు తీసుకువెళ్లండని ఆదేశించారు. నిద్రలేచిన కరణం, మునసబులు తిరిగి నాణాలు లెక్కించుకోగా సరిపోయాయి. ఇది అమ్మవారి మహిమగా వారు గుర్తించారు. అయితే అమ్మవారి రూపం ఎలా గుర్తించాలో తెలియలేదు. వారు తిరుగు ప్రయాణంలో మద్రాసు నుంచి విజయవాడకు చేరుకుని అక్కడ పడవ ప్రయాణంలో ముత్యాలపల్లికి బయలుదేరగా పడవ నిండా మట్టిరాళ్లు కనిపించాయి. వాటిలో మూడు రాళ్ళు ప్రత్యేకంగా ఉండటంతో వాటిని అమ్మవారి రూపంగా భావించారు. మరలా అమ్మవారు కనిపించి వీటిని ముత్యాలపల్లి గ్రామంలో ఈశాన్యం మూలగా ఉన్న పొన్నాలవారి తోటలోని తాడిచెట్టు కింద ప్రతిష్ఠించమని ఆదేశించడంతో మొదటి రాయిని ముత్యాలమ్మగా, రెండో రాయి మారెమ్మగానూ, మూడో రాయి పోతురాజుగా భావించి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి తాడి చెట్టు రూపంలో అమ్మవారు పూజలందుకుంటున్నారు.ముత్యాలమ్మను తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదైవంగా కొలుస్తారు. పెళ్లి, గృహప్రవేశాలు, ఇతర ఆహ్వాన పత్రాలు అమ్మవారి తాడి చెట్టుకింద పెట్టి పూజిస్తారు. ముత్యాలపల్లి ప్రాంతంలో తమ పిల్లలకు ముత్యాలమ్మ, లేదా ముత్యా లరావు, ముత్యాలరాజు ఇలా అమ్మవారి పేరు వచ్చేలా తమ బిడ్డలకు నామకరణం చేస్తుంటారు.





విద్యుద్దీపాలతో అలంకరణ



బండి ముత్యాలమ్మ అఖండ జ్యోతి



గన్ని వీరాంజనేయులుకు శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ నాయకులు, ఆప్కాబ్ సిబ్బంది

ఆప్కాబ్ చైర్మన్ గన్ని బాధ్యతలు స్వీకరణ

ఏలూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆప్కాబ్ చైర్మన్‌గా గన్ని వీరాంజనేయులు శుక్రవారం కృష్ణాజిల్లా గన్నవరంలో బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆప్కాబ్ కార్యాలయం వద్ద వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గన్ని దంపతులు పూజలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, ఆప్కాబ్ సిబ్బంది గన్నికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పార్థసారథి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, వలవల బాబ్జి, పీతల సుజాత పాల్గొన్నారు.



బ్యాంకు ఎదుట సీపీఎం నాయకులతో కలిసి ఆందోళన చేస్తున్న బాధితురాలు

బ్యాంకులో నగలు మాయమయ్యాయంటూ ఆందోళన

ఆకివీడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు లాకర్‌లో పెట్టుకున్న బంగారం మాయమైందని అధికారులను ప్రశ్నిస్తుంటే తాత్సారం చేస్తున్నారని బాధితురాలు వల్లభుని శ్రీపూర్ణలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎస్ టర్నింగ్‌లో ఉన్న గ్రామీణ బ్యాంకు దగ్గర సీపీఎం నేతలు, బంధువులతో కలిసి నేలమీద బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ బ్యాంకు లాకర్‌లో పెట్టుకొన్న బంగారం 27 కాసులు మాయమయ్యాయని అధికారులకు చెప్పి 23 రోజులు అవుతున్నా పట్టించుకోకుండా తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ హనుమంతు నాగరాజు బాధితురాలు ఎదుట బ్యాంకు అధికారులతో మాట్లాడగా తమ హెడ్డాఫీసు నుంచి సీసీ ఫుటేజ్ వచ్చినా క్లారిటీ లేనందున బ్యాంకు ఉన్నతాధికారులు శనివారం పోలీస్ స్టేషన్‌కు వస్తారనడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వర్మ, రవితేజ తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబానికి రూ.8 లక్షల ఆర్థిక సాయం

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. కుంచనపల్లి గ్రామానికి చెందిన రాపాక అచ్చయ్య బాబు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఈ సందర్భంగా బొలిశెట్టి రాజేష్, తోట రాజా మిత్రబృందం సమకూర్చిన రూ.8 లక్షలు శుక్రవారం ఎమ్మెల్యే పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ బాధిత కుటుంబంలో ఒకరికి పురపాలక సంఘంలో ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాళ్ళ గోపి కృష్ణ, కోట శ్రీరామ్, సోమశంకర్రావు, రామకూరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ గీతాబాయి

నరసాపురం రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయి అన్నారు. శుక్రవారం మండలంలోని కే బేతపూడి గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. సర్వేలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఇచ్చిన సర్వేను ఏఎన్ఎంలు పూర్తి స్థాయిలో నిర్వహించాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం కరోనా కేసులు రాష్ట్రంలో నమోదు అవుతున్నందున ప్రతి ఒక్కరూ ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు. రోగులు అనుమానాస్పందంగా ఉంటే తక్షణం వైద్యాధికారులకు సమాచారం అందించాలన్నారు. కెరూన్సీ, సిబ్బంది ఉన్నారు.



తాపీ మేస్త్రికి నూతన వస్త్రాలు అందిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు ప్రెస్‌క్లబ్ ఆదర్శంగా నిలవాలి

పాలకొల్లు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు ప్రెస్‌క్లబ్ రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచే విధంగా కృషి చేయాలని, ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి తన వంతు సహాయంగా రూ.25 లక్షలు అందజేస్తానని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రెస్‌క్లబ్ నూతన భవనం గృహ ప్రవేశం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి రామానాయుడు మాట్లాడుతూ తన విజయాలకు మీడియా మిత్రుల సహకారం ఎంతో ఉందని అన్నారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రెస్‌క్లబ్ ఆధునిక వసతులతో అందరికీ వినియోగ పడే విధంగా తీర్చిదిద్దాలని మంత్రి అన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకట రమణ దంపతులు గృహప్రవేశం చేశారు ఈసందర్భంగా సిద్ధాంతి సోమంచి శ్రీనివాసశాస్త్రి, తాపీ మేస్త్రి, ఇతర మేస్త్రిలకు మంత్రి చేతుల మీదుగా నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌వీ సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, ముత్యాల శ్రీనివాస్, పీటీ వెంకటేశ్వరరావు, గోపరాజు గోపి, కె గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముందు గంజాయి మొక్కలు పెంచిన వ్యక్తి అరెస్ట్

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో దానమ్మగుడి సమీపంలో ఇంటి ముందు గంజాయి మొక్క పెంచిన వ్యక్తిని తాడేపల్లిగూడెం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి పట్టణ ఎస్సై బాదం శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెంకు చెందిన మారిశెట్టి పద్మాకరరావు ఇంటి ముందు గంజాయి మొక్కలు ఉన్నాయని సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి గంజాయి మొక్కలు ఉన్నట్టు గుర్తించారు. మారిశెట్టి పద్మాకరరావును అదుపులోకి తీసుకున్నారు. అతడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు ఎస్సై బాదం శ్రీనివాస్ వివరించారు.



భీమవరంలో అంతర్ జిల్లాల బాలికల హాకీ పోటీలు

భీమవరం టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : 15వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల బాలికల హాకీ పోటీలు శుక్రవారం భీమవరంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని నలుమూల నుంచి మొత్తం 16 జట్లు పాల్గొన్నాయి. 10 మ్యాచ్‌లు జరగ్గా ఇందులో పశ్చిమ గోదావరి జిల్లా జట్టు కృష్ణాజిల్లా జట్టుపై 12 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ప్రారంభ కార్యక్రమంలో డీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మోషేజ్, పీడీ నరసింహరాజు, పశ్చిమగోదావరి జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి ఆనందరాజు, కార్యదర్శి బద్రినాథ్, జాయింట్ సెక్రటరీ నాగబాబు, పాల్గొన్నారు. మరో రెండు రోజులు పాటు పోటీలు జరుగనున్నాయి.





తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ స్టోరేజ్

తణుకు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ స్టోరేజీ యూనిట్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం ఆసుపత్రిలోని ప్రత్యేక గదిని సిద్ధం చేశారు. జిల్లా ఆసుపత్రి కావడంతో పలు ప్రాంతాల నుంచి అనేక సమస్యలతో ఇక్కడికి రోగులు వైద్యం కోసం వస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు రక్తం అవసరమైన సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఇటీవల ఆసుపత్రి సలహా సంఘ సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి దృష్టికి సమస్యను తీసుకు వెళ్లారు. బ్లడ్ బ్యాంకు ఏర్పాటు అయ్యేవరకు ముందుగా బ్లడ్ స్టోరేజీ పాయింట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగానే యుద్ధప్రాతిపదికన స్టోరేజీ యూనిట్‌ను ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.



వారంలో రక్తదాన శిబిరాలు

ఆసుపత్రిలో బ్లడ్ నిల్వలు పెంచేందుకు అనువుగా వారం రోజుల్లో రక్త దాన శిబిరాలు ఏర్పాటుకు సంబంధిత వైద్యులు ప్రణాళిక రుపొందిస్తున్నారు. వీలైనన్ని ఎక్కువ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి అధిక మొత్తంలో రక్తం నిల్వలు చేయనున్నారు. ఆసుపత్రిలో శాశ్వతంగా బ్లడ్ బ్యాంకు ఏర్పాటు సంబంధించిన చర్యలు వేగంగా జరుగుతున్నాయి. బ్లడ్ బ్యాంకుకు సంబంధించి ఇప్పటికే దరఖాస్తు చేశారు. దీనికి కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి కూడా వచ్చింది. మిగిలిన ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తవుతుందని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అరుణ చెప్పారు.

చదరంగం పోటీల విజేతలకు బహుమతులు



భీమవరం అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ ఎన్విరానమెంట్ డే సందర్భంగా భీమవరం అనసూయ చెస్ అకాడమీ వారిచే నిర్వహించిన నేషనల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కాళ్ళ ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలు చదరంగంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఒక్కొ మొక్క పెంచి పోషించాలన్నారు. ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం అధ్యక్షుడు వబిలిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చదరంగం నేర్చుకోవడం ద్వారా అపారమైన మేధాశక్తిని పెంపొందించుకుని విద్యలో రాణిస్తున్నారని అన్నారు. నిర్వాహకులు మాదాసు కిషోర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరికి మొక్కలు పంపిణీ చేశామన్నారు. సురేష్ జైన్, నోముల రామారావు, సునీల్, గౌరవ్, విజ్ఞాన వేదిక సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రథమ విజేత డి.సురేష్ (పాలకొల్లు), ద్వితీయ విజేత ఎన్.వరుణ్‌తేజ్ (భీమవరం), తృతీయ విజేత ఏ.రామకృష్ణ, (విజయవాడ) బహుమతులు అందుకున్నారు.

చిన్నారిని కబళించిన క్యాన్సర్

పేరూరులో విషాదఛాయలు



ముదినేపల్లి, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి) : చిన్న వయస్సులోనే ఓ బాలికను ఊపిరి తిత్తుల క్యాన్సర్ కబళించింది. పేరూ రు గ్రామానికి చెందిన గొరిపర్తి వెంకన్న, రాజేశ్వరి దంపతుల కుమార్తె మౌనిక (11) శుక్రవారం మరణించింది. ఆ బాలిక ఐదవ తరగతి చదువుతున్న సమయం లోనే గత ఏడాది ఈ వ్యాధికి గురికావడ ంతో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పరీక్షలు చేయించి వైద్యం చేయిం చినా ఫలితం లేకపోయింది. ఈ వ్యాధి తీవ్రం కావడంతో తట్టుకునే సామర్థ్యం లేని మౌనిక మరణించింది. కేవలం కూలి పనులపైనే జీవనం సాగిస్తున్న వెంకన్న దంపతులకు ఆర్థిక స్థోమత లేక తమ కుమార్తెకు దూర ప్రాంతాలకు తీసుకువెళ్ళి మెరుగైన వైద్యాన్ని చేయించలేకపోయారు. బాలిక మరణంతో పేరూరులో విషాదం నెలకొంది. మౌనిక భౌతిక కాయం వద్ద తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు అందరి హృదయాలను కలిచి వేసింది. అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ఆమె తండ్రి డాక్టర్ మనోజ్ మౌనిక కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.



సీఐటీయు కార్యాలయంలో సదస్సుకు సంబంధించిన బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

రేపు ఏలూరులో శ్రమ కావ్య గాన సదస్సు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి) : శ్రమ ఔన్నత్యాన్ని తెలియచేస్తూ డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని టుబాకో మర్చంట్ అసోసియేషన్ హాలులో ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రమ కావ్యగాన సదస్సు ప్రారంభమవుతుందని సీఐటీయు ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగ రాజు, డి.ఎన్.వి.డి ప్రసాద్‌లు తెలిపారు. శుక్రవారం సీఐటీయు కార్యాలయంలో ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, వివిధ రకాల సేవలు చేసే ఉద్యోగులు, శ్రామికులు వారి గొప్పతనాన్ని వివరిస్తూ అశోక్ తేజ శ్రమ కావ్యం రచించారని ఆయన స్వయంగా రెండు రాష్ట్రాల్లో 50 ప్రదర్శనలు ఇచ్చారని, ఈ నెల 8న ఏలూరులో 60వ సభ నిర్వహిస్తారని చెప్పారు. సదస్సుకు కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు, ఉద్యోగులు, పాల్గొనాలని కోరారు.


ఆరబెట్టిన కోకో గింజలు అపహరణ

జంగారెడ్డిగూడెం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆరబెట్టిన కోకో గింజలను ఎత్తుకుపోయిన ఘటనలో రెండు కేసులు నమోదైనట్టు ఎస్.ఐ ఎస్.కె. జబీర్ తెలిపారు. జంగారెడ్డిగూడేనికి చెందిన పెన్మెత్స అరుణ్ వర్మకు మండలంలోని రామచర్లగూడెంలో పొలం ఉంది. తన పొలంలో ట్రేలలో ఉడకబెట్టిన కోకో గింజలను ఈ నెల 4న గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి ట్రేలతో పాటు ఎత్తుకు పోయారని, వాటి విలువ రూ.62,500 ఉంటుందని ఫిర్యాదు చేసినట్టు ఎస్సై తెలిపారు. అలాగే మండలంలోని వేగవరం గ్రామానికి చెందిన రైతు అట్లూరి శ్రీనివాసరావు తన ఇంటి వరండాలో ఆరబెట్టిన 30 బస్తాల కోకో గింజలలో రూ.లక్షా 10 వేల విలువ చేసే ఆరు బస్తాల కోకో గింజలను గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 4న అపహరించుకుపోయినట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వ్యక్తి పురుగు మందుతాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దెందులూరు మండలం సోమవరప్పాడులోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన చాందిక వీర వెంకట నరేంద్ర(38) తన భార్యతో ఘర్షణ పడ్డాడు. దీంతో మనస్థాపానికి గురైన నరేంద్ర శుక్రవారం మధ్యాహ్నం పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురవగా బాధితుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



సాయి(ఫైల్)

భీమవరం క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఒక యువకుడు రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి భీమవరం రూరల్ ఎస్ఐ ఎం.వీర్రాజు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రెండవ పట్టణంలో సత్యవతి నగర్‌కు చెందిన గవిడి సాయి(22) ఖాళీగా ఉంటున్నాడు. మద్యానికి బానిసైన సాయి అప్పుడప్పుడు కొవ్వాడపుంతలోని స్నేహితుడి రూమ్‌కు వెళ్లేవాడు. ఇటీవల స్నేహితుడి భార్య డెలివరీ ఉందని ఊరు వెళ్ళాడు. ఇదే సమ యంలో సాయి ఈ నెల 1న ఫ్రెండ్ రూమ్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్ళాడు. గురువారం వరకు తిరిగి రాలేదు. తల్లిదండ్రులు స్నేహితుడి రూమ్‌లో ఉన్నాడని అనుకున్నారు. గురువారం స్నేహితుడు రూమ్‌కు వచ్చి తలుపు తీసేసరికే సాయి ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. మృతదేహం కుళ్లిపోయే స్థితిలో ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని శుక్రవారం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు.

ఊరు వెళ్తే.. ఇంట్లో దొంగలు పడ్డారు

ఏలూరు క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సభ్యులు ఊరు వెళ్ళి వచ్చేటప్పటికి దొంగలు ఆ ఇంటితాళాలు పగులగొట్టి బంగారపు వస్తువులు, వెండి వస్తువులు అపహరించుకుపోయారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు రోడ్డు శివకామాక్షి కాలనీలో నివాసం ఉంటున్న పాలవలస నాగేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో ఈనెల 4న ఊరు వెళ్ళారు. తిరిగి శుక్రవారం వచ్చేటప్పటికి ఇంట్లోని కబ్‌బోర్డులు, ఐరన్ లాకరు పగులగొట్టి ఉన్నాయి. వాటిలోని 6 గ్రాముల బంగారపు వస్తువులు, అరకేజీ వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించి ఏలూరు రూరల్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

వేలేరుపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వేలేరుపాడు ఎస్.ఐ. కేవీ రామారావు మాట్లాడుతూ తెలంగాణలోని అశ్వారావుపేటకు చెందిన సరిపల్లి నరసింహరాజు అనే వ్యక్తి కొంతకాలంగా ద్విచక్రవాహనాలు చోరీ చేస్తూ తప్పించుకు తిరుగుతున్నాడని అన్నారు. వేలేరుపాడు పోలీస్ స్టేషన్‌లో బైక్ దొంగతనాలకు సంబంధించి కేసు నమోదు కాగా విచారణ ప్రారంభించామని పక్కా సమాచారంతో శుక్రవారం దాడి చేసి ఆ వ్యక్తిని పెదబుర్రతోగు గ్రామం వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా మరో రెండు పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా చోరీలు చేసినట్టు వెల్లడైందన్నారు. వేలేరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు బైక్‌లు, పెద్దాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బైక్, సామర్లకోట పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు బైక్‌లను చోరీ చేయగా మొత్తం ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ బైక్‌ల విలువ రూ.3 లక్షల 10వేలు ఉంటుందని, నిందితుడిని జంగారెడ్డిగూడెం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

సెంట్రల్ బ్యాంకు రుణాల స్కాం దర్యాప్తు వేగవంతం



నరసాపురంలో ఉన్న సెంట్రల్ బ్యాంకు

నరసాపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ బ్యాంకు రుణాల స్కాం దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. రైతులకు తెలియకుండా వారి పొలాలను లీజ్‌కు చేస్తున్నట్లు నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి బ్యాంకులో సుమారు రూ.2 కోట్లు రుణం పొందారు. రైతులు తిరుమాని నాగరాజు, శ్రీనివాస్‌లు మరో బ్యాంకుకు రుణం కోసం వెళ్లడంతో ఈ స్కాం బయటపడింది. వారి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కూనపరెడ్డి ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. గత నెల 6న ఈ స్కాం వెలుగుచూసింది. ఇటు సెంట్రల్ బ్యాంకు స్కాంపై స్పందించి ఉన్నతాధికారులతో రెండు సార్లు దర్యాప్తు చేసింది. విచారణ అనంతరం రుణానికి సంబంధించిన కీలక పత్రాలను బ్యాంకు ఉన్నతాధికారులు వెంట తీసుకెళ్లారు. ఇటు బ్యాంకు మేనేజర్ ప్రకాశంను తప్పించి ఇన్‌చార్జి మేనేజర్ ప్రదీప్‌కు మేనేజర్ బాధ్యతలు అప్పగించారు. దీనిపై మొదట్లో రైతులు కేసు పెట్టలేదు. రాజీ చేసుకునే ప్రయత్నం చేశారు. అ తరువాత నాగరాజు, ఆయన సోదరుడు శ్రీనివాస్‌లు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. సీఐ యాదగిరికి దర్యాప్తు బాధ్యతల్ని అప్పగించారు. ఇప్పటికే ఆయన రెండ పర్యాయాలను బ్యాంకుకు వెళ్లి పలు అంశాలపై ఇన్‌చార్జి మేనేజర్ నుంచి వివరణ తీసుకున్నారు. రుణాలను సంబంధించిన డాక్యుమెంట్లను కాపీలను అప్పగించాలని కోరారు. అయితే వీటికి సంబంధించిన డ్యాకుమెంట్లు ఇంకా పోలీసులకు అందలేదు, ఇవి అందగానే కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేయనున్నట్లు సీఐ యాదగిరి చెప్పారు. అయితే ఈ లీజ్ అగ్రిమెంట్లతో తనకేమి సంబంధం లేదని కూనపరెడ్డి ప్రసాద్ స్పష్టం చేశారు. తన ఆస్తిని గ్యారంటీగా చూపి రుణం తీసుకున్నారనన్నారు. ఈ రుణం ఇప్పించడంతో పట్టణానికి చెందిన ఓ బ్రోకర్ తన వద్ద రూ.30 లక్షలు తీసుకున్నాడని ఆరోపించారు. ఇదే విషయాన్ని పోలీసులకు కూడా తెలియజేశారు. దీంతో ఈ కేసులో బ్రోకర్ కీలకంగా మారాడు. బ్యాంకు పత్రాలందిస్తేగానే ఆవి పోర్జరీవా.. లేక అసలవి అన్నవి తేలాల్సి ఉంది.

అర్చకుడి ఖాతా నుంచి నగదు మాయం

పెదపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎంత అప్రమత్తంగా ఉంటున్నా సైబర్ నేరగాళ్ల పన్నె ఉచ్చులో ఎవరో ఒక్కరూ చిక్కుకుని నగదు పోగొట్టుకుంటూనే ఉన్నారు. తాజాగా పెదపాడు మండలం తోటగూడెం గ్రామానికి ఓ పూజారి ఇదే విధంగా సైబర్ నేరగాళ్ల వలకు చిక్కడంతో రూ.99 వేలు250 నష్టపోయారు. తోటగూడెంలోని సీతారామస్వామి దేవాలయంలో అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న అంగలూరి రమణాచారికి ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ బిల్లులతో పాటుగా ఇతర బిల్లులకు సంబంధించి నగదు మీ ఖాతాకు జమ కావలసి ఉందని, అందుకు సంబంధించి మీ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నెంబరును చెప్పని శుక్రవారం సాయంత్రం ఓ ఫోన్ వచ్చింది. అది నిజమని నమ్మిన రమణాచారి తన ఫోన్‌కు వచ్చిన ఓటీపీలు చెప్పడంతో సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతా నుంచి నగదును మాయం చేశారు. దీంతో నగదు విత్‌డ్రా అయినట్టు ఫోన్‌కు మెసేజ్‌లు రావడంతో తిరిగి వారికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించి పెదపాడు పోలీసులను ఆశ్రయించాడు.

ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రాగివైరు చోరీ

ఏలూరు క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రైతుల పొలాలకు నీరందించే ట్రాన్స్ ఫార్మర్లను దొంగలు నాశనం చేస్తున్నారు. ఏలూరు సమీపంలోని చొదిమెళ్ల శివారు పొలాల్లోని 16కెవిఎ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం అర్ధరాత్రి పగులగొట్టి అందులోని రాగి వైరును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ సమాచారం తెలుసుకున్న తంగెళ్ళమూడి ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎంతో విలువైన ట్రాన్స్‌ఫార్మర్లను నిర్వీర్యం చేయడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు.

నకిలీ ఏటీఎం కార్డుతో మోసం

రూ.39,500 అపహరణ

ఆకివీడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నగదు డ్రా చేసి ఇస్తానంటూ ఓ అపరిచితుడు మాయమాటలు చెప్పి ఏటీఎం కార్డు తీసుకుని నకిలీకార్డు ఇచ్చిన ఘటన అయి-భీమవరం రోడ్డులో చోటు చేసుకుంది. ఏటీఎంలో నగదు డ్రా చేసేందుకు ఉపాధ్యాయురాలు ఎస్.సూర్యకుమారి, భర్త సత్యనారాయణమూర్తి శుక్రవారం వెళ్లారు. ఏటీఎంలో నగదు కోసం ప్రయత్నించగా నగదు రాలేదు. అక్కడే ఉన్న ఓ వ్యక్తి నేను ఇప్పుడే డబ్బు డ్రా చేశాను నేను ప్రయత్నం చేస్తానంటూ కార్డు తీసుకున్నాడు. ప్రయత్నం చేసిన అనంతరం నగదు రావడం లేదంటూ చెప్పి సూర్యకుమారికి వేరే నకిలీకార్డు ఇచ్చి వెళ్లిపోయాడు. అనంతరం నాలుగు దఫాలుగా ఏటీఎం నుంచి రూ.39,500 డ్రా చేసినట్టు ఆమె ఫోన్‌కి మెసేజ్ రావడంతో కంగారుపడి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు ఆకివీడు ఎస్ఐ హనుమంతు నాగరాజు మాట్లాడుతూ సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నామని, అపరిచితుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

చెరువులో పడి ఒకరి మృతి

పెదవేగి, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : చెరువులో దిగిన గేదెలను బయటకు రప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పెదవేగి మండలం లక్ష్మీపురం పంచాయతీ వీరంపాలెంకు చెందిన పరసా సత్య నారాయణ, రాధిక భార్యభర్తలు, వ్యవసాయ పనులతో పాటు పశుపోషణతో జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం గ్రామం సమీపంలోని ఎర్రచెరువులో దిగిన గేదెలను బయటకు రప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు ఆ నీటిలో సత్యనారాయణ (35) జారిపడి, ఊబిలో కూరుకుపోయి మృతి చెందాడు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

పశువుల అక్రమ రవాణా

ఒకరి అరెస్ట్.. కేసు నమోదు

ఏలూరు క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని ఏలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేసి అతడిపై శుక్రవారం కేసు నమోదు చేశారు. భీమడోలు అంబర్‌పేటనకు చెందిన షేక్ రహీమ్(26) బొలెరో వ్యానులో సీతంపేట నుంచి మినీవ్యానులో రెండు ఆవులను నాలుగు గిత్తలను తోటగూడెం ప్రాంతానికి తీసుకు వెళ్తున్నాడు. ఈ సమాచారం ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్‌కు అందడంతో సిబ్బందితో శుక్రవారం ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి వద్ద అతడిని వాహనాన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మినీ వ్యాన్ సీజ్ చేశారు. పశువులను ఏలూరు నగరంలోని గోశాల సమితికి తరలించారు.

ఘనంగా నిజ్జల ఏకాదశి పూజలు, అభిషేకాలు

ఏలూరుకార్పొరేషన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) :అంబికాదేవి ఆలయంలో శుక్రవారం జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి, నిజ్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ సామూహికంగా రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చనను నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొని అభిషేకాలు తిలకించి తీర్థ, అన్నప్రసాదాలు స్వీకరించడంతో ఆలయ ప్రాంతం అంబికాదేవి అమ్మవారి నాస్మరణతో మార్మోగింది.

చంద్ర రాజేశ్వరరావు జయంతి

ఏలూరుకార్పొరేషన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : పేదలకు భూమి దక్కించడం కోసం పోరాడిన భూపోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు జయంతిని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ మిత్రబృందం చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఏఐటీయూసీ నాయకులు కొంపల్లి కృష్ణమాచార్యులు, కురెళ్ళ వర ప్రసాద్, భజంత్రి శ్రీనివాసరావు, మావూరి విజయ, అడ్డగర్ల లక్ష్మీ ఇందిర పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ఎంపీ మహేశ్



ఏలూరు టూటౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ఇబ్బందులు పడుతున్న దివ్యాంగుల విషయంలో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ కలుగజేసుకుని వారికి వైకల్య నిర్ధారణ పరిక్షలు చేయించారు. పోల వరం, కుక్కునూరు మండలాలకు చెందిన 30మంది దివ్యాంగులు ఆన్‌లైన్‌లో స్లాట్‌బుక్ చేసుకని వైకల్య పరిక్షల కోసం ఏలూరు వచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఇక్కడ పరిక్షలు చేయమని, జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి వెళ్లాలని చెప్ప డంతో 150 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చిన దివ్యాంగులు దిగాలుపడ్డారు. ఈ విషయాన్ని ఏలూరులోని ఎంపీ కార్యాలయంలో చెప్పడంతో ఢిల్లీలో ఉన్న ఎంపీ స్పందించి ఆసుపత్రి వైద్యులతో మాట్లాడారు. వచ్చిన వారికి పరిక్షలు చేయించి ఎంపీ కార్యాలయంలో భోజనాలు పెట్టించారు.

సెయింట్ థెరిస్సాలో ముగిసిన రెండ్రోజుల వర్క్‌షాపు

ఏలూరు అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల శక్తిసామర్థ్యాలు - అధ్యాపకుల బాధ్యతలు అనే అంశంపై స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో రెండ్రోజులుగా జరిగిన వర్క్‌షాపు శుక్రవారం ముగిసింది. హైదరాబాద్ బాస్కో ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జోజిరెడ్డి మాట్లాడుతూ యువత సామర్థ్యం గురించి వివరించారు. ప్రిన్సిపాల్ మెర్సీ వైస్‌ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలారాణి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలి

బుట్టాయగూడెం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో సమస్యల పరిష్కారానికి వెంటనే గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయాలని సోడెం ముక్కయ్య డిమాండ్ చేశారు. ఏజెన్సీలోని గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీని ఏర్పాటు చేసి ఉపాధ్యాయ పోస్టులను స్థానిక గిరిజనులచే నింపాలని, గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివాసీ ఐక్యకార్యచరణ కమిటీ జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా గిరిజనులు రిలే నిరహార దీక్షలు చేపట్టారు. దీక్షలను శుక్రవారం ముక్కయ్య ప్రారంభించి పాల్గొన్నారు. ఆదివాసీలు న్యాయం జరిగే వరకు దీక్షలను కొనసాగిస్తామన్నారు. దీక్షల్లో కొవ్వాసి కన్నయ్య, రవ్వా బసవరాజు, తెల్లం లక్ష్మణరావు పాల్గొన్నారు.

గోవధను నిషేధించాలి

ఏలూరు రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విచ్చలవిడిగా జరుగుతున్న గోవుల అక్రమ రవాణా, గోవధలను నిషేధించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వీహెచ్‌పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గోవధను తీవ్రంగా పరిగణిస్తున్నట్టు తెలిపారు. గోవధ చేసే ముఠాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ నాయకులు, వివిధ హిందూ సంఘాల నాయకులు నెక్కంటి శ్రీనివాసరావు, నిమ్మాని నారాయణరావు, గెడ్డం నాగరాజు, సీతంరాజు చక్రధర్, సూరే శ్రీచంద్రశేఖర్ స్వామి, మేకా సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ఏలూరుకార్పొరేషన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పాం రైతుల సమస్యలపై శనివారం ఉదయం 10 గంటలకు సీపీఐ కార్యాలయ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమశేఖరాచార్యులు, లక్ష్మణరావులు తెలిపారు. సమావేశంలో ఆయిల్‌పాం రైతుల సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు. ఆయిల్ పాం రైతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఏఎస్ఆర్ నగర్‌కు విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలి

టి.నర్సాపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరి సీతారామరాజు నగర్ వాసులకు కరెంటు, నీటి సౌకర్యాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సచివాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి హరికృష్ణకు అందజేశారు. కొందరి పెద్దల కారణంగానే అల్లూరి సీతారామరాజ్ నగర్‌కు నీళ్లు, మౌలిక సదుపాయాల విషయంలో జాప్యం జరుగుతోందన్నారు. మండల కమిటీ కార్యదర్శి మడకం సుధారాణి, మడకం కుమారి, వరగడ కుమారి, మెండ్రు శిరీష, వెంకటేశ్వర్లు, అలుమోలు మురళీ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌కు రావికంపాడు విద్యార్థి ఎంపిక



కామవరపుకోట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రావికంపాడు హైస్కూల్లో ఎనిమిదవ తరగతి చదువుతున్న షేక్ మహ్మద్ రెహ్మాన్ 2024-25 సంవత్సరంలో జరిగిన ఎన్ఎంఎంఎస్ ప్రతిభ పరీక్షలో ఉత్తీర్ణత పొంది జాతీయ ఉపకార వేతనానికి ఎంపికయ్యాడని హెచ్‌ఎం ఉమ్మడి భీమరాజు శుక్రవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థికి ప్రతీ ఏటా రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాలకు 48 వేల రూపాయల స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. విద్యార్థికి శిక్షణ ఇచ్చిన తెలుగు ఉపాధ్యాయుడు బిరుదుగడ్డ నాగేశ్వరరావును హెచ్‌ఎం అభినందించారు.విద్యార్థిని విద్యా కమిటీ చైర్మన్ బి.శ్రీను, సర్పంచ్ వి.నాగేశ్వరరావు, ఎంపీటీసీ కె.అంజిరెడ్డి, ప్రసాదరెడ్డి, పాతూరి రాంబాబు, యేసుబాబు అభినందించారు.

మహిళల రక్షణ కోసమే శక్తియాప్

ఏలూరు క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినులు శక్తియాప్‌ను తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, ఎస్ఐ కాంతిప్రియ అన్నారు.ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు ఎన్ఆర్‌పేటలోని ఎన్ఆర్ఐ మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. సీఐ సుబ్బారావు, ఎస్ఐ కాంతి ప్రియ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని, మహిళ తన ఫోన్‌లో శక్తియాప్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. ఆపద సమయంలో శక్తియాప్ బటన్ నొక్కడం ద్వారా తక్షణం పోలీసులకు సమాచారం వెళ్తుందని, 10 నిమిషాల్లోపు పోలీసులు అక్కడకు చేరుకుంటారన్నారు.

ప్రజలంతా సోదర భావంతో మెలగాలి

ఏలూరు క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా కుల, మత బేధాలు మాని సోదర భావంతో జీవించాలని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ సూచించారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు 7న బక్రీద్ పండుగ జరుగుతున్న దృష్ట్యా శాంతియుతంగా పండుగను జరుపుకోవాలన్నారు. ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం వివిధ మతాల పెద్దలతో సమావేశం నిర్వహించారు. వివాదాస్పదమైన విషయాలను పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో భద్రతను బలోపేతం చేశామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ కోరారు.

యోగాంధ్రలో జిల్లా అధికారులు, ఉద్యోగులు

ఏలూరుసిటీ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో జిల్లా, వివిధ మండలాలు జలవనరుల శాఖాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సుమారు 90 మంది పాల్గొన్నారని జిల్లా జలవనరుల శాఖ ఎస్ఈ పి.నాగార్జునరావు తెలిపారు. యోగాంధ్ర వేడుకల్లో భాగంగా శుక్రవారం టీటీడీసీలో నిర్వహించిన యోగాభ్యాసనలో పాల్గొని యోగాభ్యసనాలు చేశారు. ఈ సందర్భంగా నాగార్జునరావు మాట్లాడుతూ అందరి జీవితాల్లో యోగా ఒక భాగం కావాలన్నారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నాయకులు సి.హెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో, కార్యాలయంలో తీవ్ర వత్తిడికి గురవుతుంటారని, ఒత్తిడిని తట్టుకుని పనిచేయటానికి యోగాభ్యాసం దివ్య ఔషధమన్నారు. జిల్లా జలవనరుల శాఖ డిప్యూటి సూరింటెండెంట్ పి.ధనుంజేయులు, ఈఈలు దేవప్రకాష్, జగదీష్, కె.రాజు పాల్గొన్నారు.

గన్ని ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

కామవరపుకోట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆప్కాబ్ చైర్మన్‌గా గన్ని వీరాంజనేయులు ప్రమాణ స్వీకారానికి గన్నవరానికి కామవరపుకోట మండలం నుంచి టీడీపీ శ్రేణులు ఉత్సాహంగా తరలివెళ్లాయి.చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ తూతా లక్ష్మణరావులు గన్నికి శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ మండల అధ్యక్షులు ఏలూరి హరిబాబు, చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, మాజీ వైస్ సర్పంచ్ నెక్కలపు సూర్యనారాయణ, తాడిచర్ల సర్పంచ్ పసుమర్తి పార్థసారథిబాబు, సాగిపాడు మాజీ ఎంపిటిసి వెంకటేశ్వరరావు, నెక్కలపు గంగాధరరావు తరలివెళ్ళారు.

చికెన్ వ్యర్థాలతో అనర్థాలు..

వెదజల్లుతున్న దుర్వాసనతో ఆందోళన



పెదపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోకి రోజు రోజుకూ పెరిగిపోతున్న చికెన్ వ్యర్థాల రవాణాతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ పదుల సంఖ్యలో వాహనాల్లో వేల కిలోల చికెన్ వ్యర్థాలను పెదపాడు మండలంలోని పలు గ్రామాలకు తీసుకొచ్చి చేపల చెరువుల్లో వేస్తుండటం పట్ల ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఒక్కరోజే మూడు ఐషర్ వాహనాల్లోని సుమారు 40 వేల కిలోల చికెన్ వ్యర్థాలను పోలీసులు పట్టుకోవడం చర్చనీయాంశమైంది.తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించి వసంతవాడ సమీపంలో వాహనాలను, వాహనాల్లోని చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్.ఐ కట్టా శారద సతీశ్ తెలిపారు. చేపల చెరువుల్లో చికెన్ వ్యర్థాలు వేస్తున్నారని,వీటివల్ల రొయ్యల చెరువులు నష్టపోవాల్సి వస్తోందని వీరమ్మకుంట గ్రామానికి వ్యక్తి రెండ్రోజుల క్రితం మత్స్య శాఖ అధికారులకు ఫిర్యాదు ఇవ్వడం, ఆ గ్రామంలోనే వందల ఎకరాల్లో చికెన్ వ్యర్థాలతో చేపల సాగు చేస్తున్నా ఒక్క చెరువు యజమానికే మత్స్యశాఖ అధికారులు నోటీసులివ్వడంపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. అలాగే దొరికిన వేలకిలోల చికెన్ వ్యర్థాలను నాశనం చేయడం కూడా పెద్ద సవాలుగా మారింది. పంట కాలువలు, డొంకల వెంబడి గోతులు తీసి పూడ్చి పెడుతుండటంతో ఆ ప్రాంతమంతా తీవ్ర కాలుష్యం బారినపడుతోందని, అలాగే రాత్రిపూట గోతులను తవ్వి చికెన్ వ్యర్థాలను కొంతమంది ఎత్తుకెళ్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టుకున్న వాహనాలకు సంబంధించి వాహన యజమానులు, డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు


ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

ఏలూరుటూటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు గురువారంతో ముగిశాయి. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి జి.నరసింహారావులు ముగింపు సభలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు డి.రెయాన్ష, షన్ముక్రప్రియల నృత్యాలు అలరించాయి.నారాయణరావు, సందీప్, శ్యామలా, అపర్ణకుమార్, కరుణాకర్, రమేశ్, అస్లాం, బీవీఎస్.లక్ష్మి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొండలరావు, పద్మనాభరావు, చాముండేశ్వరరావు, ఎం.శోభ, కీర్తి పాల్గొన్నారు.

● భీమడోలు: విద్యతోనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవచ్చుకోవాలని ఎంపీడీవో పద్మావతి దేవి అన్నారు. భీమడోలు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎంఈవో శ్రీనివాసరావు, ఉమా మహేశ్వరరావు, మండే సుధాకర్, గ్రంథపాలకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

● లింగపాలెం: ధర్మాజీగూడెం గ్రంథాలయంలో 34 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ముగిశాయి. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి సి.హెచ్. వెంకట రమణ, గ్రంథాలయ కమిటీ సభ్యులు బోనగిరి ప్రకాశరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

● పెదపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు దుగ్గిపోగు జాన్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

● టి.నర్సాపురం: స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారిణి ఎస్.కల్యాణి, గ్రంథపాలకుడు ఆర్.కిశోర్ పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వైద్యాధికారిణి జే.కల్యానరాణి పాల్గొన్నారు.

● ఉంగుటూరు: శాఖా గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణ ముగింపు శిబిరం కార్యక్రమంలో సర్పంచి బండారు సింధు, గ్రంథాలయ అధికారి చిన్నారులకు బహుమతులు అందజేశారు.

మలబార్ జ్యువెలరీ షో ప్రారంభం


ప్రదర్శనకు ఉంచిన ఆభరణాలు

ఏలూరు రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఏలూరు మలబార్ గోల్డ్ డైమండ్స్ షోరూమ్‌లో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు ఆర్టిస్ట్రీ - బ్రాండెడ్ జ్యూయలరీ షో ఏర్పాటు చేసినట్టు షోరూమ్ డైరెక్టర్ జైనుద్దీన్, బ్రాంచ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆర్టిస్ట్రీ షో బ్రాండెడ్ జ్యూయలరీ ఆభరణాల ప్రదర్శనను షోరూమ్‌లో శుక్రవారం ప్రదర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రదర్శనలో అద్వితీయమైన కళానైపుణ్యతతో అంతులేని హుందాతనంతో కూడిన ఆభరణాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ ఆభరణం కళాదక్షతకి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆభరణాలు ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశామన్నారు. బంగారం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 28 పాయింట్లు నాణ్యత పరీక్షలు నిర్వహించి అందిస్తున్నట్టు తెలిపారు. మార్కెటింగ్ మేనేజర్ నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధే లక్ష్యం



పెదవేగి, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : మహిళల స్వయం ఉపాధే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలను అమలు చేస్తోం దని దెందులూరు ఏఎంసీ చైర్‌పర్సన్ గారపాటి రామసీత అన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధిని అందుకుంటేనే సాధి కారత సాధ్యపడుతుందన్నారు.పెదవేగిలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ శిబిరాన్ని రామసీత శుక్రవారం ప్రారంభిం చారు. దీనికి అనుగుణంగా మహిళలు ఆర్థిక స్వావలంబ నతో ఎదిగితేనే అది సాధ్యపడుతుందన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చొరవతో పెదవేగిలో ప్రారంభించిన ఈశిక్షణ శిబిరంలో మహిళలకు మూడు నెలల పాటు కుట్టు శిక్షణ అందించి, వారి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడమే లక్ష్యమని ఆమె తెలిపారు. ఎంపీడీవో పి.శ్రీనివాస్, సర్పంచ్‌లు మేకా కనకరాజు, నెక్కలపూడి సురేశ్‌బాబు, టీడీపీ మండలాధ్యక్షుడు అనిల్ కుమార్, టి.సత్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు, ప్రదీప్ పాల్గొన్నారు.

ప్రమోషన్ల కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఏలూరు కార్పొరేషన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో సచివాలయం హెల్త్ కార్యదర్శులకు ఎంపీహెచ్ఏ(ఎఫ్) ప్రమోషన్ల కౌన్సెలింగ్‌ను వెంటనే నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి. ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడుతూ తొమ్మిది నెలల క్రితమే హెల్త్ కార్యదర్శులకు ప్రమోషన్లు ఇవ్వాలని ఆదేశాలిచ్చినా జిల్లా అధికారులు తాత్సారం చేశారని అన్నారు. కౌన్సెలింగ్ డేట్‌లు ఇచ్చి వాయిదాలు వేసి హెల్త్ కార్యదర్శులకు అన్యాయం చేశారన్నారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఇచ్చిన ఆదేశాలు అమలు చేయకుండా 15వ తేదీకి కౌన్సెలింగ్ వాయిదా వేయడం తగదన్నారు. రాష్ట్రంలో అనేక జిల్లాల్లో ప్రమోషన్లు పొంది రెగ్యులర్ ఏఎన్ఎంలు అయ్యారని, మన జిల్లాలో మాత్రం హెల్త్ కార్యదర్శులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తొమ్మిది నెలలుగా అలసత్వంగా వ్యవహరించి ట్రాన్స్‌ఫర్ ఉత్తర్వుల పేరుతో ప్రమోషన్లు నిలిపివేయడం అన్యాయమన్నారు. తక్షణమే హెల్త్ కార్యదర్శులకు ప్రమోషన్ల కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

శారీరక వ్యాయామంపై అవగాహన

భీమడోలు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): యుక్త వయస్సు బాలికలు శారీరక వ్యాయామం, క్రీడల పట్ల ఆసక్తిని కనబర్చాలని భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శారద సూచించారు. భీమడోలు శివారు అర్జావారిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం 2.0 యుక్త వయస్సు బాలికల సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు డైరెక్టర్ శారద పాల్గొని కిశోర బాలికలు తీసు కోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: వేంపాడులో ఐసీటీఎస్ సూపర్‌వైజర్ టి.మేరీ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాలికలతో యోగాసనాలు, వ్యాయామాలు చేయించారు. సౌజన్య, నాగలక్ష్మి, సావిత్రి, పలువురు కిశోర బాలికలు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పాలన : చింతమనేని


దుగ్గిరాలలో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి):ఏపీ అభివృద్ధికి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. సుపరిపాలనకు అంకురార్పణ జరిగి ఏడాదైన సందర్భంగా గాలాయగూడెంలో శుక్రవారం జనసేన పార్టీ నాయకులు పూజారి వెంకట రత్నం నాయుడు, పూజారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న అందరికీ నగదు బహుమతులు అందజేశారు. మండల తెలుగు యువత అధ్యక్షుడు ఏనుగు రామకృష్ణ, వెన్నమనేని రాజా దోరేపల్లి రమేశ్, పూజారి రాజశేఖర్, ఠాగూర్, ఏఎంసీ డైరెక్టర్ మద్దా దయానంద రాజు, కొప్పాక వెంకటేశ్వరరావు, పూజారి సీతారాం పాల్గొన్నారు.

● పెదవేగి : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలన సాగుతోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పలు గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలపై ఎమ్మెల్యే చింతమనేని వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన హామీ ఇచ్చారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి

టి.నర్సాపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి కూలీలకు 13వారాల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. మధ్యాహ్నపువారిగూడెంలో వెంకటాపురం గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం బృందం శుక్రవారం పర్యటించి ఉపాధి పని ప్రదేశాలకు వెళ్లి ఉపాధికూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఉపాధి బకాయిలు చెల్లించాలని, మేట్లకు 10వేలు కనీసవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మడకం సుధారాణి, కుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి వ్యాక్యూమ్ మిషన్ అందజేత



వేలేరుపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు మెరుగైన సేవలందించాలనే సేవాదృక్పథంతో వేలేరుపాడుకు చెందిన ప్రముఖ వ్యాపారి కర్పూరం గోపాలకృష్ణ, ఆయన కుమారుడు శ్రీకాంత్‌గుప్తా ఆరోగ్య కేంద్రానికి రూ.20 వేల విలువ చేసే హైవాక్యూమ్ మిషన్‌ను శుక్రవారం వైద్యాధికారిణి కె.అగత అందించారు. సేవాదృక్పధంతో ముందుకు వచ్చిన దాతలకు డాక్టర్ అగత ధన్యవాదాలు తెలిపారు.

సినిమాల్లో అవకాశం కల్పిస్తా : కరాటం

కొయ్యలగూడెం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సినిమాల్లో అవకాశం కల్పిస్తానని సినీ నిర్మాత, మాజీ డీసీసీబీ చైర్మన్ కరాటం రాంబాబు అంతర్జాతీయ ఫొటో గ్రాఫర్ అవార్డు అందుకున్న మద్దాల శేఖర్‌కు హామీ ఇచ్చారు. గోపాలపురం మండలం దొండపూడికి చెందిన శేఖర్ శుక్రవారం వివిధ జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్న సందర్భంగా కరాటం రాంబాబును కలిశారు. ఇన్ని అవార్డులు అందుకున్నందుకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తానన్నారు. ఆయిన మారుమూల ప్రాంతం నుంచి ఉన్నత స్థానానికి ఎదిగినందుకు అభినందించారు.

బక్రీద్‌ను ఘనంగా జరుపుకోండి

కొయ్యలగూడెం, జూన్6 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు బక్రీద్‌ను సంతోషంగా చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో 30 మంది పేద ముస్లిం మహిళలకు పిండి వంటల సామగ్రిని అందజేశారు. టీడీపీ నాయకురాలు రమా పాల్గొన్నారు.

ఆలయ శంకుస్థాపన

కొయ్యలగూడెం, జూన్6(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య స్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. శుక్రవారం ఉదయం తాడేపల్లిగూడెం రోడ్డులోని ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న ఆలయం రోడ్డుకి దగ్గరగా ఉండటంతో మార్చి త్వరలోనే నూతన ఆలయాన్ని నిర్మించి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ తాడికొండ మురళీకృష్ణ, మేకల అన్నవరం, సత్తిపండు, మంతెన సోమరాజు, సతీశ్, స్థలదాత రత్నం, రాంబాబు, జవ్వాది శ్రీను, భక్తులు పాల్గొన్నారు.

గడ్డి వాము దగ్ధం



ఏలూరు క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): దెందులూరు గ్రామానికి చెందిన ఆకుల కొండయ్యకు చెందిన 15 ఎకరాల వరి గడ్డివాము అగ్ని ప్రమాదానికి గురైంది. శుక్రవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరగడంతో ఈ సమాచారం అందుకున్న జిల్లా అగ్నిమాపక శాఖాధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో ఫైర్ ఇంజన్ సంఘటనా స్థలానికి వెళ్ళి మంటలను పక్క పొలాలకు వ్యాపించకుండా అదుపు చేశారు. అప్పటికే 15 ఎకరాల గడ్డివాము దగ్ధమైంది. ఈ నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

నేడు వాటర్ ట్యాంకులకు శంకుస్థాపన

వేలేరుపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ శనివారం మండలంలో పర్యటించనున్నారు. మేడేపల్లి, రామవరం, పంచాయతీల్లోని అల్లూరి నగర్, ఇప్పలగుంపు, మల్లారం, చెరువుగొల్లగూడెం, తెల్లపల్లి, గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు పరిష్కరించేందుకు హైలెవెల్ వాటర్ ట్యాంకులు మంజూరయ్యాయి.వీటికి శంకుస్థాపన నిర్వహించేందుకు ఎమ్మెల్యే ఉదయం 9 నుంచి ఆయా గ్రామాల్లో వాటర్ ట్యాంకులకు శంకుస్థాపన చేయనున్నారు. దీనికి సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది.

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

» డీఎస్పీ శ్రావణ్ కుమార్


సూచనలిస్తున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్

ఏలూరు క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ పోలీస్ అధికారులకు సూచించారు. సబ్ డివిజన్ పరిధిలోని సీఐలతో శుక్రవారం రాత్రి ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో సబ్‌డివిజన్ క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. సబ్ డివిజన్‌లోని కేసుల వివరాలు, వాటి దర్యాప్తు స్థితిగతులు తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని డీఎస్పీ ఆదేశించారు. సమావేశంలో కైకలూరు రూరల్ సీఐ వి రవికుమార్,భీమడోలు సీఐ యుజె విల్సన్, నిడమర్రు సీఐ ఎంవి శుభాష్, ఏలూరు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ, టూటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్‌లు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ కార్యాలయం ప్రారంభం



జంగారెడ్డిగూడెం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అశ్వారావు పేట రోడ్డులోని కాకర్ల పెట్రోల్ బంకు వెనుక శుక్రవారం పట్టణ టీడీపీ కార్యాలయాన్ని పట్టణాధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ ప్రారంభించారు. పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, రావూరి కృష్ణ, పెనుమర్తి రామకుమార్,అబ్బిన దత్తాత్రేయ,కరుటూరి రమాదేవి,బొబ్బర రాజ్‌పాల్ కుమార్,నంబూరి రామచం ద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, గుమ్మడి ప్ర సాద్, చెరుకూరి శ్రీధర్, బూరుగుపల్లి సూరిబాబు,రాజాన పండు,షేక్ యాకూబ్, తూటిగుంట రాము, కంపా రా జేంద్ర, పాతూరి అంబేద్కర్, మారిశెట్టి బాల చిట్టెమ్మ, పగడం సౌభాగ్యవతి పాల్గొన్నారు.

నేడు ఎంఆర్పీఎస్ ఆవిర్భావ సభ

ఏలూరు టూటౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామాలు, మండలాల్లో ఘనంగా నిర్వహించాలని ఎంఎస్‌డీ జిల్లా అధ్యక్షులు కందుల రమేశ్ అన్నారు. ఇజ్రాయిల్‌పేట ఎంఆర్పీఎస్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పట్ల అన్నికులాలు లబ్ధిపొందుతాయన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసిన సీఎం నారా చంద్రబాబు మాదిగ ఉపకులాలు రుణపడి ఉంటాయన్నారు. బి.ఎస్.ఎల్. వెంకటేశ్వరరావు, కె.సత్యం పాల్గొన్నారు.



దివ్యాంగుల ఇంటివద్దకే రేషన్

పెదపాడు, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దే ప్రతినెలా ఐదవ తేదీలోగా నిత్యవసరాలు పంపిణీ చేయనున్నట్టు పెదపాడు తహసీల్దారు కృష్ణజ్యోతి తెలిపారు. పెదపాడులో రేషన్ పంపిణీని ప్రక్రియను తహసీల్దారు కృష్ణజ్యోతి శుక్రవారం పరిశీలించారు. రేషన్ పంపిణీ విధివిధానాలపై రేషన్ డీలర్లకు పలు సూచనలు చేశారు. నిర్ణీత వేళల ప్రకారం డిపోలను తెరిచి కార్డుదారులకు రేషన్ సరుకులను అందజేయాలని, డిపోకు వచ్చే లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. గ్రామ వీఆర్వోలు, డీలర్లు సమన్వయంతో సరుకులు పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీఆర్వో నరసింహ పాల్గొన్నారు.



సీఐగా క్రాంతికుమార్ బాధ్యతలు

చింతలపూడి, జూన్ 6(ఆంధ్రజ్యోతి) :సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టి.క్రాంతికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాకినాడ నుంచి బదిలీపై చింతలపూడి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన రాజశేఖర్ ఏలూరు క్రైం శాఖకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బాధ్యత స్వీకరించిన క్రాంతికుమార్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రజలు సహకరించాలని కోరారు. నిఘా పెంచుతామని, ఎవరైనా అనుమానాలు వస్తే సూచనలివ్వవచ్చని తెలిపారు.



ట్రాక్టర్ ట్రక్కు బోల్తా

ద్వారకాతిరుమల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీవారి శేషాచలకొండపై ఓ గడ్డి ట్రాక్టరు బోల్తా కొట్టింది. నిత్యం భక్తులు సంచరించే ఆ ప్రాంతంలో ప్రమాదం జరిగే సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో పెనుముప్పు తప్పింది. గణపవరం మండలం వీరేశ్వరపురానికి చెందిన ఓ భక్తుడు గోసంరక్షణశాలలోని గోవుల నిమిత్తం గడ్డిని ఇస్తానని మొక్కుకున్నాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం స్వగ్రామం నుంచి గడ్డి ట్రాక్టరుతో బయల్దేరాడు. శేషచలం ఘాట్ రోడ్డులో గోశాలకు వెళ్లే మార్గంలో మలుపు వద్ద అదుపు తప్పి ట్రక్ బోల్తా కొట్టింది.

విద్యుత్ నిలిచిపోయే ప్రాంతాలివే

టి.నర్సాపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని జంగారెడ్డిగూడెం ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్ శ్రీఫీర్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం తెలిపారు. శనివారం నుంచి 13వ తేదీ వరకు టి.నర్సాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని మర్రిగూడెం నూతన సబ్ స్టేషన్‌కు కొత్త విద్యుత్ లైన్లు అమర్చడం, ఆర్‌డీఎస్ఎస్.పనులు జరుగుతున్నందున ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మర్రిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

లోఓల్టేజి సమస్య పరిష్కరించాలి

జీలుగుమిల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన జీలుగుమిల్లిలో లోవోల్టేజ్ సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. గత రెండ్రోజులుగా విద్యుత్ కోతలు విధిండంతో చిన్నారులు వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల అవసరాల్ని గుర్తించి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఇంట్లో టీవీలు, ఫ్రీజ్‌లు, లోవోల్టేజీ సమస్యకు కాలిపోతున్నాయని వాపోయారు. టాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని పరిష్కరించాలని కోరారు.

విత్తనాలు సీజ్

కలిదిండి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా హెచ్చరించారు. శుక్రవారం సానారుద్రవరం వెంకటేశ్వర సీడ్ షాపును మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్‌తో కలసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా గొడౌన్‌లో ఉన్న రూ.21,63,500 విలువ గల 710 క్వింటాళ్ల విత్తనాలను సీజ్ చేశామన్నారు.

ఘనంగా చండ్ర రాజేశ్వరరావు జయంతి

నూజివీడు టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : చండ్ర రాజేశ్వరరావు 111వ జయంతి కార్యక్రమం నూజివీడు అమర్ భవనంలో సీపీఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. తొలుత చండ్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర సమితి నాయకులు చలసాని వెంకట రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ చండ్ర రాజేశ్వరరావు భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికి పేద వర్గాల కోసం పోరాటం చేశారన్నారు.

ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వరేమి..?

చాట్రాయి మండల సమావేశంలో అధికారులను నిలదీసిన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

చాట్రాయి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులు గురించి ప్రజాప్రతినిదులకు సమాచారం అందించాలని ఎంపీపీ లంకా నిర్మల అధికారులను కోరారు. చాట్రాయి మండల పరిషత్ సమావేశం శుక్రవారం జరిగింది. గ్రామాల్లో ఏ కార్యక్రమం జరిగినా అధికారులు తమకు తెలియజేయటం లేదని పలువురు ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకురాగా, ఇక నుంచిఇటువంటికి పునరావృతం కాకుండా అధికారులు చూడాలని ఎంపీపీ సూచించారు. ఏవో శివశంకర్ మాట్లాడుతూ రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు సరపరా చేశామని, ఈ ఏడాది 1250 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం అని, మండలంలో 15,600 అన్నదాత సుఖీభవ లబ్ధిదారులు ఉన్నారని, కౌలు రైతులకు కూడా రాయితీలు అందజేస్తున్నట్లు వివరించారు. ఉద్యానశాఖ అధికారి హేమ మాట్లాడుతూ పండ్లు కూరగాయలు పూలు సాగు చేసే రైతులకు సబ్సిడీలు అందజేస్తున్నామని, బిందు సేద్యం, యంత్ర పరికరాలకు రాయితీలు ఉన్నాయని, పామాయిల్ మొక్కలు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. విద్యుత్ ఏఈ సంజయ్ మాట్లాడుతూ వ్యవవసాయ, గృహ విద్యుత్ వ్యవస్థలను వేరు చేస్తూ పనులు చేస్తున్నామని, ఫలితంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. నూజివీడు ఆర్అండ్‌బీ డీఈ బాబూరావు మాట్లాడుతూ చనుబండ పీహెచ్‌సీ భవనం నిర్మాణానికి టెండర్లు పిలుస్తున్నా కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదని, రూ.3 కోట్లతో చిత్తపూరు- బూరుగుగూడెం రోడ్డు అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తామని, వివరించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

9 నుంచి బలుసులమ్మ జాతర



ముదినేపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం శివారు ఐనంపూడిలో బలుసులమ్మ అమ్మవారి జాతర ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహిస్తారు. జాతరకు దేవస్థానం వద్ద విశాలమైన ఆవరణలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 9న లక్ష్మీగణపతి హోమం, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు, 10న పుట్టలో పాలు పోయుట, సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం, అన్నసమారాధన, బలుసులమ్మ తల్లికి 108 బిందెలతో జలాభిషేకం, కుంకుమార్చన జరుగుతాయని దేవస్థానం కమిటీ అధ్యక్షులు పెద్దింటి కృష్ణమూర్తి తెలిపారు.

విజయదుర్గా దేవికి ప్రత్యేక పూజలు



ముదినేపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దేవపూడి గ్రామంలోని విజయ దుర్గాదేవి దేవస్థానంలో శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. విజయదుర్గ అమ్మవారికి ఆ గ్రామానికి చెందిన కట్టా వెంకట రమేష్ దంపతులు చీరె సమర్పించి అలంకరణ చేశారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు దాసరి భగవాన్లు ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి విశేష పూజలు జరిపారు.

శ్రీరాముడికి మంత్రి పూజలు


మంత్రిని ఆశీర్వదిస్తున్న పండితులు

నూజివీడు, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి) : నూజివీడు మండల బోర్వాంచ శివారు కొన్నగుంట గ్రామంలోని శ్రీరాముడి దేవాలయంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు ప్రార్థసారధి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం శ్రీరాములవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరయ్యారు.

గ్రావెల్‌తో అంతర్గత రహదారుల అభివృద్ధి


సూరేపల్లి ఎస్‌ఏస్సీ కాలువపై రహదారిపై గ్రావెల్ పోసి చదును చేస్తున్న దృశ్యం

ముసునూరు, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని సూరేపల్లి గ్రామంలో అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారులను గ్రావెల్‌తో పూడ్చుతున్నారు. సూరేపల్లి గొల్లగూడెం పరిధిలో గుంతలు మయంగా ఉన్న ఎస్ఎస్సీ కాలువ రహదారి, చిత్తపూరు లింక్ రోడ్డు, హిందు శ్మశానవాటికకు వెళ్ళే రహదారికి సూమారు 150 ట్రిప్పులు పైగా గ్రావెల్‌ను పోసి అభివృద్ధి చేశారు. పంచాయతీ పరిధిలో ఉన్న అంతర్గత రోడ్లను పూర్తిస్థాయిలో ప్రజలకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు నాయకులు తెలిపారు.

కోర్టుకు హాజరైన ముద్దరబోయిన


కోర్టు నుంచి బయటకు వస్తున్న ముద్దరబోయిన

నూజివీడు టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు ముద్రబోయిన వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరయ్యారు. గత వైసీపీ పాలనలో నాటి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులను నిరసిస్తూ నాటి నూజివీడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులతో కలిసి ధర్నాకు దిగారు. దీంతో నూజివీడు పట్టణ పోలీసలు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నూజివీడు ప్రత్యేక న్యాయస్థానంలో వ్యక్తిగతంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి హాజరయ్యారు.

మొక్కజొన్న రైతులకు పరిహారం చెల్లింపు



నూజివీడు టౌన్, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి) : నూజివీడు మండలంలో బోర్వంచ గ్రామ సీడ్ మొక్క జొన్న బాధిత రైతులకు నష్టపరిహారంను శుక్రవారం అమర్ భవనంలో సీపీఐ సీనియర్ నేతలు కొమ్మన నాగేశ్వరరావు, చలసాని వెంకటరామరావు చేతుల మీదుగా న్యూజెన్‌సీడ్స్ కంపెనీ ఆర్గనైజర్లు రైతులకు అందించారు. బోర్వంచ గ్రామంలో 30 మంది 68 ఎకరాలకు రూ.22.70 లక్షల నష్టపరిహారంగా అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆయా కంపెనీలతో ఖచ్చితంగా అగ్రిమెంట్ రాసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహ, రైతు సంఘం నాయకులు రాయంకుల లక్ష్మణరావు, మడుపల్లి నాగేంద్రరావు, సీడ్ ఆర్గనైజర్లు తిరుమలరావు, బాధిత రైతులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ


ఆగిరిపల్లి..కలిదిండిల్లో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

ఆగిరిపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు ముగిశాయి. ఏప్రిల్ 28 నుంచి జూన్ 6 వరకు నిర్వహించామని గ్రంథాలయ అధికారి డి.నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, నీతి కథలు చెప్పడం, చదివించడం, పేపర్ క్రాఫ్ట్, జీకే వివిధ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కూల్ హెచ్‌ఎం వీరంకి గోపాలరావు, బి.జయరాజు (రిటైర్డ్ ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయి)లు బహుమతులు అందజేశారు.

ముదినేపల్లి: నలభై రోజులపాటు గ్రంథాలయాల్లో విద్యార్థులకు జరిగిన వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ముదినేపల్లి గ్రంథాలయంలో ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో శిబిరాల్లో నిత్యం పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను గ్రంథాలయాధి కారిణి ఎం.శ్రీదేవి అందజేశారు

చాట్రాయి: విద్యార్థులు నిత్యం పుస్తక పఠనం చేస్తే విజ్ఞానవంతులుగా తయారై చదువుల్లో రాణిస్తారని తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చనుబండ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సభ జరిగింది. ఈ శిబిరంలో నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పరసా శ్రీను, బొంతు సతీష్, లైబ్రేరియన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండి, కోరుకొల్లు గ్రంథాలయాల్లో 40 రోజులుగా జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారం ముగిశాయి. ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు తహసీల్దార్ రామకృష్ణ బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈకార్యక్రమంలో కలిదిండి, కోరుకొల్లు గ్రంథాలయాధికారులు జె.రమేష్ బాబు, రాఘవులు, సాహితీ మిత్రులు ఎల్.ఆర్.పోలిశెట్టి కళా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నారిని కబళించిన క్యాన్సర్

పేరూరులో విషాదఛాయలు


మౌనిక (ఫైల్)

ముదినేపల్లి, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి) : చిన్న వయస్సులోనే ఓ బాలికను ఊపిరి తిత్తుల క్యాన్సర్ కబళించింది. పేరూరు గ్రామానికి చెందిన గొరిపర్తి వెంకన్న, రాజేశ్వరి దంపతుల కుమార్తె మౌనిక (11) శుక్రవారం మరణించింది. ఆ బాలిక ఐదవ తరగతి చదువుతున్న సమయం లోనే గత ఏడాది ఈ వ్యాధికి గురికావడ ంతో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసు పత్రిలో పరీక్షలు చేయించి వైద్యం చేయిం చినా ఫలితం లేకపోయింది. ఈ వ్యాధి తీవ్రం కావడంతో తట్టుకునే సామర్థ్యం లేని మౌనిక మరణించింది. కేవలం కూలి పనులపైనే జీవనం సాగిస్తున్న వెంకన్న దంపతులకు ఆర్థిక స్థోమత లేక తమ కుమార్తెకు దూర ప్రాంతాలకు తీసుకువెళ్ళి మెరుగైన వైద్యాన్ని చేయించలేకపోయారు. బాలిక మరణంతో పేరూరులో విషాదం నెలకొంది. మౌనిక భౌతిక కాయం వద్ద తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు అందరి హృదయాలను కలిచి వేసింది. అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ఆమె తండ్రి డాక్టర్ మనోజ్ మౌనిక కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

సరిహద్దు వివాదంలో దంపతులపై దాడి

ముదినేపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : భార్యాభర్తలు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలైన సంఘటన లలవడాలి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన విజయకుమారి ఈనెల 3వ తేదీన తమ ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి మొక్కకు బియ్యం కడిగిన నీళ్ళు పోయగా ఆ నీళ్ళు పక్కనే ఉన్న స్థలంలోకి వెళ్ళాయి. దీంతో సరిహద్దు స్థలంలో నివాసం ఉంటున్న వారితో వివాదం ఏర్పడింది. విజయకుమారి, ఆమె భర్త వెంకట నాగేశ్వరరావుపై నాని, నాగేశ్వర రావు, నాగు తదితరులు కర్రలతో కొట్టి గాయపరిచారు. గాయాలకు గురైన భార్యాభర్తలు గుడివాడ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరగా శుక్రవారం ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చాట్రాయిలో విద్యుత్ మరమ్మతులు కారణంగా 7వ తేదీ శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గృహ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సంజయ్ తెలిపారు. గృహ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

9న కొల్లేరు సమస్యల కార్యాచరణపై సమావేశం

కైకలూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కొల్లేరు సమస్యను సీఈసీ కమిటీకి వివరించేందుకు తీసుకోవాల్సిన కార్యాచరణపై ఈ నెల 9వ తేదీన సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర చేపలరైతు సంఘం అధ్యక్షుడు నంబూరి వెంకటరామరాజు (తాడినాడ బాబు) తెలిపారు. శుక్రవారం ఆయన కైకలూరులో మాట్లాడుతూ త్వరలో కొల్లేరులో సెంట్రల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ(సీఈసీ) పర్యటిస్తుందని స్థానికంగా ఉన్న సమస్యలను ఈ కమిటీ దృష్టికి తీసుకువెళ్లేందుకు సోమవారం ఉదయం 9గంటలకు కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో కొల్లేరు ప్రజల ఐక్యవేదిక రాష్ట్ర చేపలరైతుల సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి కొల్లేరు గ్రామాలకు సంబంధించిన సమస్యలు గ్రామాల వారీగా జనాభా, విస్తీర్ణం, కొల్లేరుకు సంబంధించిన అంశాలతో రాతపూర్వకంగా ఆయా గ్రామాలకు చెందిన పెద్దలు, ప్రజాప్రతినిధులు, రైతులు తీసుకురావాలన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ హాజరవుతా రన్నారు. కొల్లేరు సమస్యల అన్నీ అంశా లను ఈ సమావేశాంలో చర్చించడం, కమిటీ వచ్చిన సమయంలో అవలంబిం చాల్సిన విధానాలను వివరించనున్నట్లు తెలిపారు.

పెదలంక టీడీపీ అధ్యక్షుడిగా వీరాంజనేయులు


వీరాంజనేయులును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

కలిదిండి, జూన్ 6 (ఆం ధ్రజ్యోతి): పెదలంక గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా కొక్కిలి గడ్డ వీరాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం పెదలంకలో జరిగిన టీడీపీ సమావేశం లో గ్రామ టీడీపీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పోకల సుబ్బా రావు, ప్రధాన కార్యదర్శిగా చాబత్తిన శ్రీనివాసరావు, కోశాధికారిగా కొల్లాటి నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా ఎం.పురుషోత్తం, బి.సామోరు, ఎస్.రాజమోహన్‌రావు, కోకా హరిబాబు, జల్లా బండి రాజు, బి.వెంకట్రావు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జిల్లా టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి చక్రవర్తి, తెలుగు రైతు ఉపాధ్యక్షులు దుగ్గిరాల పరమేశ్వరరావు, అక్కల బోసు, నాయకులు దున్న భోగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



ముసునూరు, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి): గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి పనులు చేస్తు న్న కూలీలకు టీడీపీ గ్రామ అధ్యక్షులు ఉప్పల పాటి గణేష్ శుక్రువారం తన ఖర్చులతో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కర్ర రాంబాబు, గుడిమెల్లి జయరాజు, స్వర్ణకుమారి, కిషోర్, రాజు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇవ్వాలి

నూజివీడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు టిడ్కో ఇళ్లను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సబ్ కలెక్టర్ బి స్మరణరాజ్‌కు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ 2016వ సంవత్సరంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం ప్రారంభించిన ప్రభుత్వం ఆతర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలలో అధికారంలోకి రాగానే వెంటనే ఆరు నెలల్లో పూర్తి చేసి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను అప్పగిస్తామని హామీ ఇచ్చిందన్నారు. హామీ ఇచ్చి సంవత్సరం గడుస్తున్నా ఇంత వరకు పట్టించుకోలేదని, నూజివీడు పట్టణంలో ఉన్న లబ్ధిదారులు చాలా మంది కూలి పనులు చేసుకుంటూ అద్దె ఇళ్లల్లో ఉంటున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి టిడ్కో లబ్ధిదారులకు అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసి, వాటికి మౌళిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



పెండ్లి కుమారుడికి బంగారు నాణెం అందజేత

చాట్రాయి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జయపురం పాల సహకార సంఘం సభ్యుడు బొరిగొర్ల నాగేశ్వరరావు గోపాలకృష్ణ వివాహం సందర్భంగా కృష్ణామిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద రూ.20 వేలు విలువైన బంగారు నాణాన్ని శుక్రవారం క్లస్టర్ మేనేజర్ సాంబశివ మూర్తి, సంఘం అధ్యక్షుడు కొల్లి వరప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో రూట్ సూపర్‌వైజర్ నరసింహారావు, వేతన కార్యదర్శి శ్రీనివాసరావు, పాడి రైతులు పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులు అందించేలా చర్యలు

కైకలూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డును త్వరితగతిన మంజూరు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. శుక్రవారం కైకలూరు మండల వ్యవసాయ కార్యాలయంలో గ్రామ వ్యవసాయాధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పచ్చిరొట్ట కిట్స్ పంపిణీ, మట్టి నమూన సేకరణలు, కౌలు గుర్తింపు కార్డుల వివరాలు నమోదు, వరి విత్తనాల పంపిణీ తదితర వాటిపై చర్చించారు. ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డు మంజూరు చేసేలా రెవెన్యూ అధికారులతో మాట్లాడాలన్నారు. కౌలు గుర్తింపు కార్డు ఉంటేనే ఆ రైతులకు రుణాలు మంజూరు అవుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఆర్.గంగాధరరావు, మండల వ్యవసాయాధికారిణి ఆర్ దివ్య, తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్ షిప్‌కు ముగ్గురు ఎంపిక


రాజా దుర్గాసేతు మాధవి, బొల్లా రాణి, జోవియల్

ముదినేపల్లి, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి): జాతీయ మీన్స్ - కం - మెరిట్ స్కాలర్ షిప్ పొందేందుకు ముదినేపల్లి మండలం వడాలి జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన ఇద్దరు ఎనిమిదవ తరగతి విద్యార్థులు అర్హత సాధించారు. ఈ హైస్కూలుకు చెందిన రాజా దుర్గాసేతు మాధవి, బొల్లా రాణి స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారు. గత ఏడాది డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఎన్ఎంఎస్ స్కాలర్ షిప్ పరీక్ష ఫలితాలు గురువారం విడుదల కాగా, ఈ ఇరువురు విద్యార్థులు ఉత్తీర్ణులై అర్హత సాధించారని హైస్కూల్ హెచ్ఎం విప్రభుదాసు తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు వీరికి ఏడాదికి రూ.12 వేలు ఉపకార వేతనం అందుతుందని తెలిపారు.

ముసునూరు: జాతీయ ఉపకార వేతనానికి చెక్కపల్లి జడ్పీపాఠశాల విద్యార్థి బట్టు జోవియల్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు షేక్ అల్లాబక్షు తెలిపారు. శుక్రువారం ఆయన మాట్లాడుతూ 2024లో జాతీయస్థాయిలో జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ పరీక్షల్లో అర్హత సాధించాడన్నారు. ఈ విద్యార్థికి సంవత్సరానికి రూ 12,000 చొప్పున వరుసగా ఐదేళ్ళ పాటు ప్రభుత్వం ఉపకార వేతనాన్ని అందించనున్నట్లు ఆయన చెప్పారు.

జిల్లా స్థాయి క్రికెట్ విజేత పెదలంక జట్టు


విజేతగా నిలిచిన పెదలంక జట్టు

కలిదిండి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పెదలంక గ్రామంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో పెదలంక జట్టు ప్రథమ స్థానం సాధించింది. విజేతగా నిలిచిన పెదలంక జట్టుకు రూ.లక్ష నగదు, షీల్డ్‌ను సర్పంచ్ మోకా లక్ష్మీ రామకృష్ణ, వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు అక్కల వెంకటాచలం అందించారు. రెండో స్థానంలో నిలిచిన వడ్లమన్నాడు జట్టుకు రూ.50 వేలు నగదు, షీల్డ్, మూడోవ స్థానంలో నిలిచిన గుడివాడ జట్టుకు రూ.25 వేలు నగదు, షీల్డ్‌ను నిర్వాహకులు ముద్దం హరీష్, కోకా నరేష్, దుగ్గిరాల శరత్, దుగ్గిరాల సత్తిపండు, బుల్లి వెంకయ్య అందజేశారు.

వంట ఏజెన్సీలకు శిక్షణ


కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

ముదినేపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై ప్రభుత్వ పాఠశాలల వంట ఏజెన్సీ ప్రతినిధులకు శుక్రవారం స్థానిక ఎంఆర్‌సి సెంటర్‌లో అధికారులు శిక్షణ ఇచ్చారు. ఎంఈవో కె.నరేష్ కుమార్ ఏజెన్సీ నిర్వాహకులకు ఈ పథకం అమలు తీరుపై సూచనలు చేస్తూ మెనూను తప్పక పాటించాలని తెలిపారు. భోజన పథకం నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలన్నారు. రిసోర్సు పర్సన్లు ఏజెన్సీ నిర్వాహకులకు మెనూ అమలు, వంటల వద్ద, భోజనాలు నిర్వహించే ప్రదేశాల వద్ద పాటించాల్సిన పరిశుభ్రత తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

కలిదిండి: మధ్యాహ్న భోజన పథకంపై శుక్రవారం కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో కుక్‌లు, హెల్పర్స్‌కి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వెలమల శ్రీనివాసరావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలన్నారు. భోజనం రుచికరంగా ఉండే విధంగా వంట చేయాలన్నారు. వంట శాలలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణ కుమారి, రిసోర్స్ పర్సన్ సిహెచ్.అరుణ కుమారి, సిఆర్పీలు పాల్గొన్నారు.


నూజివీడు, చాట్రాయిలలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

అమ్మపేరుతో ఒక మొక్క నాటాలి

నూజివీడు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా ప్రతి పౌరుడు భావించాలని బీజేపీ నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలి అనే కార్యక్రమాన్ని శుక్రవారం బాపునగర్ 144వ బూత్‌లో నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగరాణి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ కాలుష్యంతో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదమేర్పడిందన్నారు. అమ్మపేరుతో ఒక మొక్కను నాటే బాధ్యతను తీసుకోవాలని కోరారు. పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి దోసపాటి మల్లిఖార్జున జగదీష్, బండి సాయి, సుశీల, వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

చాట్రాయి: ప్రధాని మోదీ పిలుపు ఇచ్చిన అమ్మ పేరుతో ఒక మొక్క నినాదంతో చాట్రాయి అభయాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ఆగస్టు 15 వరకు రోజుకు ఒక గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గడ్డం సంజీవరెడ్డి, ముత్తారెడ్డి, శ్రీకర్, ఓబిళ్ళనేని రాజా, దాసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.